PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 236 | విజయవాడ, గురువారం 30 మార్చి 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 30 March 2023 | Rs

గూగుల్‌కు ఎన్‌సిఎల్‌ఎటి భారీ షాక్

- రూ.1,137 కోట్ల జరిమానా చెల్లించాల్సిందే
- సిసిఐ కేసులో ఆదేశాలు

లోపలి పేజీలో..

వివేకా హత్యకేసుపై అయిదుగురితో కొత్త సిట్



- ప్రస్తుత దర్యాప్తు అధికారి రాంసింగ్ తొలగింపు
- ఏప్రిల్ 30లోగా కుట్ర కోణంపై దర్యాప్తు ముగించండి
- సుప్రీం కోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు సిబిఐ డిఐజి కెఆర్ చౌరాస్య పర్యవేక్షణలో కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను సుప్రీంకోర్టు బుధవారం ఏర్పాటు చేసింది. ప్రస్తుత దర్యాప్తు అధికారి రాంసింగ్‌ను తొలగించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. సిబిఐ దర్యాప్తు వేగంగా సాగటం లేదని, విచారణ అధికారి (ఐఒ)ని మార్చాలని కోరుతూ ఈ కేసులో ఏ5 నిందితుడిగా ఉన్న శివశంకర్ రెడ్డి భార్య తులసమ్మ దాఖలు చేసిన పిటిషన్ విచారణలో ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. హత్య కేసులో విస్తృత కుట్ర కోణాన్ని బయటపెట్టేందుకు ఏప్రిల్ 30లోగా దర్యాప్తును ముగించాలని స్పష్టం చేసింది. ఆరు నెలల్లోగా విచారణ మొదలుకాకపోతే ఈ కేసులో ఏ5 నిందితుడు శివశంకర్ రెడ్డి బెయిల్ కోసం దాఖలు చేసుకోవచ్చని తెలిపింది. సిబిఐ డిఐజి కెఆర్ చౌరాస్య పర్యవేక్షణలో కొత్త సిట్‌లో సభ్యులుగా ఎస్‌పి వికాస్ కుమార్, అడిషన్ ఎస్‌పి ముఖేష్ శర్మ, ఇన్‌స్పెక్టర్లు ఎస్.శ్రీమతి, నవీన్ పునియా, సబ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్ యాదవ్ ఉన్నారు. సిబిఐ ప్రస్తుత దర్యాప్తు అధికారి రాంసింగ్‌ను తొలగించింది.

మౌలిక సదుపాయాల్లో ప్రయివేట్ భాగస్వామ్యం

- విశాఖలో ముగిసిన జి-20 ఐడబ్ల్యుజి సమావేశాలు
- కేంద్ర ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ సోలోమన్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రేపటి ఆర్థిక నగరాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రయివేట్ రంగ పెట్టుబడి 'మెయిన్ డ్రైవర్'గా ఉంటుందని జి-20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యుజి)-2 సమావేశాలు పేర్కొన్నాయి. విశాఖలోని రాడిషన్ బ్లూ హోటల్లో మంగళవారం ప్రారంభమైన ఈ సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ప్రపంచ వ్యాప్తంగా పట్టణాలు, నగరాలను ఆర్థిక అభివృద్ధికి కేంద్రాలుగా చేయడం, పట్టణ మౌలిక సదుపాయాలకు ఆర్థిక సహాయంపై దృష్టి కేంద్రీకరించడం, పట్టణ మౌలిక సదుపాయాల నిర్మాణానికి వివిధ అంశాలను గుర్తించడం ప్రధాన అంశాలుగా సమావేశంలో చర్చించారు. ప్రధానంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యయంపై డేటా తయారు చేసి ప్రయివేట్‌రంగ భాగస్వామ్యానికి అనుగుణంగా నివేదికలు రూపొందించడంపై చర్చలు సాగాయి. సమ్మిళిత అభివృద్ధి సదుపాయాల కల్పన అంశంపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు వివరించారు.

వేర్వేరు నిర్వచనాలు : సోలోమన్

రెండు రోజుల సమావేశాల్లో పాల్గొన్న జి-20 దేశాల ప్రతినిధుల్లో ఆయా నగరాలు, పట్టణాలకు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల సమీకరణ, ప్రయివేట్‌రంగ భాగస్వామ్యంపై భిన్న నిర్వచనాలు వ్యక్తమయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సోలోమన్ ఆరోక్యరాజ్ తెలిపారు. జి-20 సమావేశాల ముగింపు సందర్భంగా బుధవారం సాయంత్రం రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరాలు, పట్టణాల ప్రాజెక్టులు, వ్యయాలు, వనరుల సమీకరణ తదితర అంశాల ఆధారంగా ప్రయివేట్ భాగస్వామ్యం పాత్ర ఉంటుందని నిర్ణయించినట్లు చెప్పారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ జియోగ్రఫీ (ఐఎన్ఇజిఐ), మెక్సికో, ఆఫీస్ ఫర్ నేషనల్ స్టాటిస్టిక్స్, బ్రిటన్ ప్రతినిధులు జాతీయ మౌలిక సదుపాయాల వ్యయాన్ని మెరుగుపరచడంపై కేస్ స్టడీస్ పత్రాలు వర్క్‌షాప్‌లో సమర్పించారని తెలిపారు. జి-20 దేశాలకు చెందిన కొంతమంది ప్రతినిధులతో నగరాలు, పట్టణాల్లో కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ గురువారం జరగనుందని ఆరోక్యరాజ్ చెప్పారు. శుక్రవారం కూడా సమావేశాలు కొనసాగనున్నాయి.



సోలోమన్


మోగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నగారా

- మే 10న పోలింగ్, 13 ఓట్ల లెక్కింపు
- తొలిసారిగా ఓట్ ఫ్రం హోమ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. మే 10న ఎన్నికల పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. భారత ఎన్నికల ప్రధానాధికారి (సిఇసి) రాజీవ్ కుమార్ బుధవారం నాడిక్కడ నిర్వహించిన మీడియా గోష్టిలో ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 80 ఏళ్లు నిండిన వృద్ధులకు, వికలాంగులకు మొట్టమొదటిసారి 'ఓట్ ఫ్రం హోం'ను ప్రవేశపెడుతున్నారు. రాష్ట్రంలో 1,200 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు చెప్పారు. 29,141 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 224 అసెంబ్లీ స్థానాలుండగా, వీటిలో 36 ఎస్‌సి, 15 ఎస్‌టి , జనరల్ కేటగిరీలో 173 సీట్లు ఉన్నాయి. ప్రస్తుత కర్ణాటక అసెంబ్లీ కాలపరిమితి మే 24తో ముగియనుంది. తాజా ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ఏప్రిల్ 13న వెలువడుతుంది. నామినేషన్ల దాఖలుకు గడువు ఏప్రిల్ 20తో ముగుస్తుంది. 21న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ గడువు 24తో ముగుస్తుంది. మొత్తం ఓటర్లు 5,24,11,557 మంది కాగా, వీరిలో 5,23,63,948 మంది జనరల్ ఓటర్లు, 47,609 మంది సర్వీస్ ఓటర్లు (ఉద్యోగులు) ఉన్నారు. పురుషులు 2,62,42,561 మంది, మహిళలు 2,59,26,319 మంది, థర్డ్ జండర్ 4,751 మంది ఉన్నారు. యువ ఓటర్లు 9,58,806 మంది, 12,15,142 మంది 80 ఏళ్ల దాటిన వృద్ధులు, 5,60,908 వికలాంగ ఓటర్లు ఉన్నారు.

ఇదీ షెడ్యూల్



ప్రక్రియ	తేదీ
నోటిఫికేషన్	ఏప్రిల్ 13
నామినేషన్లదాఖలుగడువు	ఏప్రిల్20
నామినేషన్ల పరిశీలన	ఏప్రిల్ 21
నామినేషన్ల ఉపసంహరణకు గడువు	ఏప్రిల్ 24
పోలింగ్	మే 10
ఓట్ల లెక్కింప	మే 13

మోదానీ సర్కార్‌ను సాగనంపాల్సిందే!

హిందువులంటే అదానీ, అంబానీలేనా?

- బిజెపికి పేదలు కనిపించరా!
- జనచైతన్య యాత్ర ముగింపు సభలో ప్రకాశ్ కరత్



బుధవారం హైదరాబాద్‌లో జరిగిన జనచైతన్య యాత్ర ముగింపు సభలో ప్రసంగిస్తున్న ప్రకాశ్ కరత్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హిందువులంటే అదానీ, అంబానీలేనా? అని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను సిపిఎం అగ్రనాయకులు, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ సూటిగా ప్రశ్నించారు. వారి సంక్షేమం కోసమే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. హిందువుల్లో భాగమైన పేదలు, ఎస్‌సిలు, ఎస్‌టి, ఒబిసిలు బిజెపికి కనిపించరా? అని ప్రశ్నించారు. నిరుద్యోగం, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పేదలు సతమతమవుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు కల్పిస్తూ సామాన్యులపై భారాలు మోపుతోందని విమర్శించారు. ప్రజల మధ్య మతచిచ్చు రెచ్చగొడుతోందని దుయ్యబట్టారు. మతతత్వం, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని, కేంద్రంలోని అదానీ, అంబానీ ప్రభుత్వాన్ని కూల్చాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 17న వరంగల్‌లో ప్రారంభమైన జనచైతన్య యాత్ర ముగింపు సభ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బుధవారం జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హిందూత్వ పేరుతో మతతత్వాన్ని రెచ్చగొడుతూ, దేశంలోని సహజ వనరులను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

అదానీ అక్రమాలపై విచారణకు మోడీ సిద్ధంగా లేరు

అదానీ అక్రమ సంపాదనపై పార్లమెంటులో చర్చ జరగకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆయన విమర్శించారు. 2014లో అదానీ ఆస్తులు రూ.50 వేల కోట్లుండేవని, మోడీ ప్రధాని అయ్యాక ఇప్పుడు రూ.10.3 లక్షల కోట్లకు పెరిగాయని తెలిపారు. ఇంత తక్కువ కాలంలో అంత సంపద పెరగడానికి, 2014లో అదానీ ప్రపంచ కుబేరుల్లో 609వ స్థానంలో ఉంటే ఇప్పుడు రెండో స్థానానికి చేసుకోవడానికి మోడీ అండగా ఉండడమే కారణమని అన్నారు. ఈ అక్రమ సంపాదనపై దర్యాప్తు సంస్థలు పట్టించుకోవడం మిగతా 7లో

పోలవరానికి రూ.10 వేల కోట్లు ఇవ్వండి

- అమిత్ షాతో సిఎం జగన్ భేటీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టును మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం రాత్రి 10:45 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నివాసంలో ఆయనతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 40 నిమిషాల పాటు జరిగిన ఈ ఏకాంత భేటీలో రాజకీయ అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. అకాల వరదల కారణంగా పోలవరం డయాఫ్రంవాల్ దెబ్బతిందని, డయాఫ్రంవాల్ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు దాదాపు రూ.2,020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని డిడిఆర్‌ఎంపి అంచనా వేసిందని, ఈ డబ్బును వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖజానా నుంచి ఖర్చు చేసిన రూ.2,600.74 కోట్లు రెండేళ్లగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాల్సిందిగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ.55,548 కోట్లుగా నిర్ధారించిందని, ఈ మొత్తానికి వెంటనే ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి సరఫరా అంశాన్ని కూడా పోలవరం ప్రాజెక్టులో భాగంగా చూడాలని, ప్రాజెక్టు నిర్మాణంలో కాంపొనెంట్ వారీ నిబంధనలను సడలించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు వీలైనంత త్వరగా పరిహారం ఇవ్వాలని, ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటి) పద్ధతిలో ముంపు బాధితులకు ఈ సహాయం అదిస్తే జాప్యాన్ని నివారించవచ్చని కోరారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్ల పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నిధులను వెంటనే విడుదలయ్యేలా చూడాలని కోరారు. 2021-22లో రూ.42,472 కోట్ల రుణపరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లు తగ్గించారని, ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరారు. తెలంగాణ డిస్కంల నుంచి ఏపి జెన్‌కోకు, 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉందని, వీటిని వెంటనే ఇప్పించాల్సిందిగా కోరారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద లబ్ధిదారుల ఎంపికలో హేతు బద్ధత పాటించకపోవడం వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పిఎంజికెఎవై కార్యక్రమం కిందకు రాని రూ.56లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా రేషన్ ఇవ్వడంవల్ల దాదాపు రూ.5,527 కోట్ల భారాన్ని మోయాల్సి వస్తోందని తెలిపారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని, మెడికల్ కాలేజీలను మంజూరు చేయాలని కోరారు.

ఫ్యామిలీ డాక్టర్ తరహా.. ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్

- 15 నుంచి రబీ సీజన్ ధాన్యం సేకరణ


లోపలి పేజీలో..

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రెండో విడత ప్రొబేషన్‌పై అనిశ్చితి

- గ్రేడ్-5 కార్యదర్శులకు అధికార బదిలీలు ఇప్పట్లో లేనట్లే!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు రెండో విడత ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ అనిశ్చితిలో పడింది. 2020 డిసెంబరులో నెలలో రెండో విడతలో ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు 2022 డిసెంబరు నెలతో రెండేళ్ల సర్వీసు పూర్తయినప్పటికీ నేటికీ ప్రొబేషన్ డిక్లేర్ చేయకపోవడం పట్ల వారిలో నిరాశ, నిస్పృహలు చోటు చేసుకున్నాయి. విశ్వసనీయసమాచారం మేరకు రెండో విడతలో ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ జూలైలో కానీ లేక ఆగస్టులో ఉండే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. కానీ, అప్పుడైనా ప్రకటిస్తారా? అంటే అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. మొదటి నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్ అయిన వారికి 9నెలలు ఆలస్యంగా ప్రొబేషన్ డిక్లేర్ చేశారు. గతేడాది మార్చి నాటికే ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు ప్రకటించారు. ఆ గడువు పూర్తయి ఏడాది గడచినా ఇంతవరకు దీని అతీగతి లేదు. మార్చి నెల ముగుస్తున్నా ఇందుకు సంబందించిన కసరత్తు పూర్తి కాక పోవడంతో ప్రొబేషన్ కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రొబేషన్ డిక్లేర్ కాక పోవడంతో సుమారు 17వేల మంది ఉద్యోగులు కేవలం రూ.15వేల జీతానికి విధులు నిర్వహించడం కష్టంగా మారిందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఎపి గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇది ఇలా ఉండగా గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ఎంపికైన 7040 మంది గ్రేడ్ -5 పంచాయితీ కార్యదర్శులకు నేటికీ అధికారాల బదిలీ జరగలేదు. దీంతో జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్‌శాఖ విడుదల చేసిన జీఓ నెంబరు 149లో డిడిఓ అధికారాలు ఉంటాయని పేర్కొంది. అధికారాల బదిలీల ప్రక్రియ నేటికీ పూర్తి కాలేదు. క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి ప్రతి పంచాయితీ కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేశారు. తక్షణమే అధికారాలు బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి జానిపాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



విజయవంతంగా సారెక్స్-2023

- ముగిసిన కోస్ట్ గార్డ్ మాక్ డ్రిల్

లోపలి పేజీలో..

ఒకటి నుంచి టోల్ ఛార్జీల పెంపు

- రూ.250 కోట్ల ఛార్జీల భారం
- ఈ నెల 31న ఆందోళనలు

పరీక్షలప్పుడు ఎంఆర్‌ఒ ఆఫీసుల్లోనే

- గతంలో సస్పెండైన ఉపాధ్యాయులపై విద్యాశాఖ నిర్ణయం
- ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గతేడాది పదో తరగతి పరీక్షల సమయంలో మాల్ ప్రాక్టీస్‌కు సహకరించి సస్పెండైన ఉపాధ్యాయు లను తహశీల్దారు కార్యాలయాల్లో ఉంచాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు కడప ఆర్‌జెడి, చిత్తూరు, ఏలూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, నంద్యాల, ప్రకాశం జిల్లాల విద్యాశాఖ అధికారులను బుధవారం ఆదేశించారు. రాష్ట్రంలో ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. గతేడాది పరీక్షల సమయంలో సస్పెండైన ఉపాధ్యాయులను తహశీల్దారు కార్యాలయాల్లోనే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంచాలని ఆదేశించారు. కమిషనరు ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని మిగతా 7లో



మంగళవారం ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరంలో జరిగిన భారీ నిరసన ర్యాలీ

ఆందోళనలతో అట్టుడుకుతున్న ఫ్రాన్స్ !

- పెన్షన్ సంస్కరణలపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం
- దిక్కుతోచని స్థితిలో మాక్రాన్

లోపలి పేజీలో..

సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తాం

- ఎపిలో అధికారం... తెలంగాణలో పునర్వైభవం
- టిడిపి 41వ ఆవిర్భావ సభలో చంద్రబాబు
- రాజమండ్రిలో త్వరలో మహానాడు



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలన్నింటిని టిడిపి అధికారంలోకి వచ్చాక కూడా కొనసాగిస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఎపిలో అధికారం చేజిక్కించుకోవడం, తెలంగాణలో టిడిపికి పునర్వైభవం తీసుకురావడం లక్ష్యంగా పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోగల నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో బుధవారం జరిగిన టిడిపి 41వ ఆవిర్భావ సభలో ఆయన ప్రసంగించారు. ముందుగా టిడిపి జెండా ఎగురవేసి ఎన్‌టి.రామారావుకు నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం టిడిపిని ఎన్‌టిఆర్ స్థాపించి ఎన్నో సామాజిక, ఆర్థిక, సంక్షేమ సంస్కరణలకు నాంది పలికారని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో త్వరలో టిడిపి మహానాడు సభ నిర్వహిస్తామని, ప్రపంచ వ్యాప్తంగా ఎన్‌టిఆర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాను చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు. తన హయాంలో కట్టిన హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, జీనోమ్ వ్యాలీ, ఇతర అభివృద్ధి పనులను తర్వాత వచ్చిన సిఎంలు ముందుకు తీసుకుపోకుంటే హైదరాబాద్‌కు ఇంతఖ్యాతి వచ్చేది కాదంటూ ఆ ముఖ్యమంత్రులందరికీ చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఎపి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని సైకో అనాలో? విధ్వంసకారుడు అనాలో? అర్థం కావట్లేదని విమర్శించారు. హైదరాబాద్‌కు దీటుగా అమరావతి నిర్మాణం చేపట్టాలని తాను ప్రణాళికలు రచిస్తే, దాన్ని నాశనం చేసి రాజధానిని మూడు ముక్కలాట చేశారని దుయ్యబట్టారు. జగన్ విధానాల వల్ల రాష్ట్రంలో అభివృద్ధి 30 ఏళ్ల వెనక్కిపోయిందని, బీహార్ గన్ కల్చర్ మిగతా 7లో

అచ్చన్న హంతకులను శిక్షించాలి : సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ అచ్చెన్న హంతకులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. హంతకులతో సంబంధం ఉన్న రాష్ట్ర డైరెక్టర్‌తో సహా ఉన్నతాధికారుల పాత్రపైనా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి వాస్తవాలు వెల్లడించాలని కోరారు. దళిత ఉద్యోగులపై జరుగుతున్న దాడులు, వేధింపులు, అత్యాచారాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని, దీనికోసం శాశ్వత ప్రాతిపదికపై కమిషన్ను నియమించాలని డిమాండు చేశారు.

ఒకటో తేదీ నుంచి వర్క్ డౌన్

- ఎండియు అసోసియేషన్ వెల్లడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఈ నెలాఖరులోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వర్క్ డౌన్ చేస్తామని ఆంధ్రప్రదేశ్ మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రౌతు సూర్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్‌జిఒ హోంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ వాహనాలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినా బ్యాంకు ఆఫ్ బరోడా మాత్రం అమలు చేయడంలేదని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు దివాకర్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అనుమతించం

- స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పోరాట కమిటీ నేతలు
- కేంద్ర మంత్రితో సహా వివిధ రాజకీయ పార్టీల నేతలకు వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అనుమతించబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్థేతోపాటు వివిధ రాజకీయ పార్టీల నేతలను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు తదితరులు కలిశారు. ఎలమరం కరీం (సిపిఎం), పి.సంతోష్ కుమార్ (సిపిఐ), అధిర్ రంజన్ చౌదరి (కాంగ్రెస్), వి విజయసాయి రెడ్డి, భీశెట్టి సత్యవతి (వైసిపి), కె రామ్మోహన్‌నాయుడు, గల్లా జయదేవ్ (టిడిపి), సందీప్ పాఠక్ (ఆప్), సిఎం రమేష్ (బిజెపి), తిరుమవలయన్ (విసికె)తో పాటు 14 మంది వివిధ పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు కలిశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే తమ పోరాటనికి సహకరించాలని, మద్దతు ఇవ్వాలని నేతలు ఆయా పార్టీల ఎంపిలను కోరారు. తెలుగు ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుందని విమర్శించారు. 32 మంది బలిదానంతో, వేలాది మంది రైతులు ఇచ్చిన భూములతో ఈ స్టీల్‌ప్లాంట్ ఏర్పడిందని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం రైతులు 23 వేల ఎకరాలు ఇచ్చారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకున్నరోజు నుండి కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నాయని, రాష్ట్రంలోని అన్ని పార్టీలూ మద్దతు ఇచ్చాయని తెలిపారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన లావాదేవీలు, లీగల్ సలహాదారులను తాము అనుమతించలేదని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.5,000 కోట్లు మాత్రమే పెట్టుబడి పెట్టిందని, కానీ డివిడెండ్లు, పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రూ.50 వేల కోట్లకుపైగా ఇచ్చిందని తెలిపారు. దేశంలోని ఈ స్టీల్‌ప్లాంట్‌కే సొంత గనులు కేటాయించడం లేదని, అయినప్పటికీ స్టీల్‌ప్లాంట్ పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరుకు మద్దతు ఇవ్వటం లేదని విమర్శించారు. తాము కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్థే, ఉక్కు శాఖ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హాను కలిశామని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కేంద్ర మంత్రి, రాజకీయ పార్టీల నేతలను కలిసిన వారిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె అయోధ్య రాము, కెఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, వై మస్తానప్ప, కారు రమణ, విల్లా రామ్మోహన్ కుమార్, జి. గణపతి రెడ్డి, ఎన్ వెంకన్న, కె శ్రీనివాస నాయుడు, డి సువర్ణ రత్నం తదితరులు ఉన్నారు.



కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్‌ను కలిసిన స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల పోరాట కమిటీ నేతలు జె అయోధ్య రాము తదితరులు

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తూట్లు

- దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ సర్కారు
- ఎఐసిసి అధికార ప్రతినిధి రాజీవ్ గౌడ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి బిజెపి తూట్లు పొడుస్తోందని, దేశ సంపదను కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం దోచిపెడుతోందని ఎఐసిసి అధికార ప్రతినిధి రాజీవ్ గౌడ ఆరోపించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అదానీ ఆర్థిక అవకతవకలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని కేంద్ర ప్రభుత్వం ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీపై కక్ష సాధింపు చర్యలకు బిజెపి ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. పార్లమెంటులో అధికార పక్షమే సభకు అంతరాయం కలిగిస్తోందన్నారు. అదానీ కుంభకోణం గురించి హిండెన్‌బర్గ్ నివేదిక చెబుతోందని, గౌతమ్ అదానీ సోదరుడు ఒకరు దుబాయ్‌లో ఉంటారని, అదానీ డబ్బును మొత్తం తారుమారు చేస్తున్నారన్నారు. దేశంలో భారీ కుంభ కోణం జరుగుతోందని, ఇది ప్రధాన మంత్రి కార్యాలయం సహాయంతో జరిగిందని ఆయన ఆరోపించారు. దేశంలో స్వతంత్రంగా పనిచేయాల్సిన ఏజెన్సీలు మోడీ కోసం పని చేస్తున్నాయన్నారు. మీడియా సమావేశంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, విజయవాడ పట్టణ అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, లీగల్ అడ్వైజరు గురునాథం పాల్గొన్నారు.

దేవాదాయ కమిషనర్ ఉత్తర్వులపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

ఆలయ భూములను కాపాడేందుకు దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు చర్యలు ఏమాత్రం సంతృప్తిగా లేవని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గుంటూరులోని ఓ ఆలయ భూములను అధికారిక జాబితా (22ఏ) నుంచి తొలగిస్తూ దేవాదాయశాఖ కమిషనరు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఆ భూములపై ఎవరికైనా ప్రైవేటు వ్యక్తులకు అధికారం ఉంటే వాళ్ల న్యాయపరమైన పోరాటం చేసుకోవాలేగానీ అధికారులు ఆ విధంగా ఉత్తర్వులు జారీకి అధికారం లేదని తేల్చింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలిచ్చింది. గుంటూరులోని కంచికామాక్షి ఏకాంబరేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన రెండెకరాల భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి దేవాదాయశాఖ కమిషనరు తొలగింపు నిర్ణయాన్ని హేమందగ గుప్తా సహా నలుగురు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిల్‌ను బుధవారం విచారణ సందర్భంగా రాజకీయ నేతల అభీష్టానికి అనుగుణంగా చర్యలు తీసుకునే కమిషనరు ఆ పదవిలో కొనసాగే అర్హత ఉండదని వ్యాఖ్యానించింది. కమిషనరు నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టామని ఎజి ఎస్ శ్రీరామ్ చెప్పారు. ఆలయ భూముల రక్షణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. దీంతో విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

నవమి శుభాకాంక్షలు

గవర్నరు, సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం వేర్వేరు ప్రకటనల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయమే శ్రీరామనవమి పండగని గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. సీతారాముల దీవెనలతో రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిలాషించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ రాములవారి కళ్యాణాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

గవర్నరుతో హర్యానా గవర్నరు భేటీ

గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో హర్యానా గవర్నరు బండారు దత్తాత్రేయ రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. బాపట్లలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చిన దత్తాత్రేయ కేవలం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారని రాజ్‌భవన్ వర్గాలు పేర్కొన్నాయి.

ఎస్‌సి కార్పొరేషన్ పథకాల కోసం దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా అమలు చేయనున్న అమృత్‌జలధార, యంగ్ ఎంటర్ ప్రెన్యూర్ పథకాల్లో లబ్ధికోసం అర్హులైన ఎస్‌సిలు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ జలధార పథకం కింద ఎస్‌సి రైతుల భూములకు నీటి వసతిని కల్పించేందుకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. బ్యాంకులు, ఇతర సంస్థల ద్వారా ఇప్పటికే రుణాలు మంజూరైన రైతులకు బోరు బావులు, స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకోవడానికి రూ.50 వేలు సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. యంగ్ ఎంటర్ ప్రెన్యూర్ పథకంలో ట్రాక్టర్లు, ట్రాలీలు, కమర్షియల్ వాహనాలు, వేర్ హౌసెస్ తదితర స్వయం ఉపాధి పథకాలకు కూడా రూ.60 వేలు సబ్సిడీగా ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు రెండున్నర ఎకరాల భూమి, రూ.3 లక్షలలోపు వార్షిక ఆదాయం కలిగిన రైతులు అమృత్ జలధార పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, యంగ్ ఎంటర్ ప్రెన్యూర్‌కు వ్యాలిడ్ డ్రైవింగ్ లైసెన్స్, ఆదాయ, కుల, విద్యా ధ్రువీకరణ పత్రాలు, రేషన్, ఆధార్ కార్డులు, బ్యాంకు పాస్‌పుస్తకాల నకళ్లతో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయాలి

- ఎండిఎం కార్మికుల యూనియన్
- పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5వ తేదీన మజ్దూర్ కిసాన్ సంఘర్షణ యాత్ర చలో ఢిల్లీ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం (ఎండిఎం) కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని ఎండిఎం కార్మికుల యూనియన్ పిలుపునిచ్చింది. ఇందుకు సంబంధించిన పోస్టరును సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో నాయకులు బుధవారం ఆవిష్కరించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఎండిఎం పథకం పేరు మార్చి బడ్జెట్ తగ్గించిందని విమర్శించారు. ప్రైవేట్ సంస్థలకు దీనిని అప్పగించే కుట్రలు ప్రభుత్వం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 12 కోట్ల మంది పిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారని, దేశవ్యాప్తంగా 26 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికులను గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచాలని, కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దని, నిర్వహణకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 12 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టరు ఆవిష్కరణలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, పి అజయ్‌కుమార్, కార్యదర్శి నూర్‌మహ్మద్, ఎండిఎం కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి డి రమాదేవి, యూనియన్ నాయకులు వీణ, వేమేశ్వరి, రంగారెడ్డి పాల్గొన్నారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న వి ఉమామహేశ్వరరావు, పి అజయ్‌కుమార్, డి రమాదేవి తదితరులు

మాజీ మంత్రి యర్రా నారాయణ స్వామి కన్నుమూత

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి)




మాజీమంత్రి, టిడిపి సీనియర్ నాయకులు యర్రా నారాయణస్వామి (92) పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. వయోభారంతోపాటు అస్వస్థతకు గురవ్వడంతో ఐదు రోజులుగా స్థానిక ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉండి మండలం ఉప్పులూరుకు చెందిన నారాయణస్వామి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, ఉండి విశాల సహకార పరపతి సంఘం చైర్మన్‌గా పని చేశారు. 1972లో కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్సీగా ఎన్నికై 1976-78 మధ్య కాలంలో మంత్రిగా పని చేశారు. ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించాక ఆ పార్టీలో చేరి తాడేపల్లిగూడెం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. 1988లో జడ్‌పి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1994-99 మధ్య కాలంలో రాజ్యసభ సభ్యునిగా పని చేశారు. తర్వాత కాలంలో వయోభారంతో ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటున్నారు. అంత్యక్రియల నిమిత్తం నారాయణస్వామి భౌతికకాయాన్ని ఉప్పులూరు తరలించారు. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రయివేటీకరణ కుట్రలను తిప్పికొడతాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు కేంద్రం ప్రభుత్వం పన్నుతోన్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌పాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 776వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాల ఉద్యోగులు, పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, జె.రామకృష్ణ, డి.దేముడు, జి.ఆనంద్ మాట్లాడారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం 32 మంది ప్రాణత్యాగం చేశారని, అటువంటి పాంట్‌ను ప్రయివేటీకరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. కార్మికులు, ప్రజల ఆకాంక్షను గుర్తించకుండా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ప్లాంట్‌కు రావాల్సిన ముడి సరుకును నిలిపివేసి, ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టేలా కుట్రలు చేస్తోందని పేర్కొన్నారు. ముడిసరుకు లేమితోనే ప్లాంట్‌కు నష్టాలొస్తున్నాయని తెలిపారు. దీక్షల్లో మోహన్ కుమార్, డి.రమేష్, జివి.రమణారావు, విల్లూరి మహాలక్ష్మి నాయుడు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.



వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్

రాష్ట్రంలో కుంటుపడిన అభివృద్ధి

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి -పెనుకొండ (సత్యసాయి జిల్లా)

రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర బుధవారం సత్యసాయి జిల్లా సోమందేపల్లి సమీపంలోని నల్లగొండ్రాయనపల్లి నుంచి ప్రారంభమైంది. విడిది కేంద్రం వద్ద బ్రాహ్మణ సామాజిక తరగతులతో భేటీ, సోమందేపల్లి దళితవాడలో ఎస్‌సి మహిళలతో లోకేష్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్‌టిఆర్ కూడలిలో చేనేత, పెనుకొండ మండలం వెంకటాపురం తండాలో స్థానికులు, శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఆర్చి వద్ద స్థానికులతో మాటామంతీ చేపట్టారు. అనంతరం ఎన్‌గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రావడం లేదన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్రం కూరుకుపోయిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలపైనే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలనూ వైసిపి ప్రభుత్వం పెంచేసిందని విమర్శించారు. ఎనిమిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. గంజాయిని విచ్చలవిడిగా అమ్ముతూ వైసిపి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం పై ప్రజలు అసహ్యంతో ఉన్నారని, లోకేష్ వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారని జెసి తెలిపారు. యాత్ర పెనుగొండ క్రాస్ వద్దకు చేరుకుంది.

పది పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విశాఖ జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి జిల్లా కలెక్టర్లు, పోలీసు, విద్యాశాఖ, వైద్యశాఖ, పోస్టల్, ఆర్‌టిసి అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ.. గత సంవత్సరం పరీక్షల నిర్వహణలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచినీటి సదుపాయం, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాలను ప్రతిరోజూ కలెక్టర్లు సందర్శించాలని ఆదేశించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టరు మల్లికార్జున, అధికారులు పాల్గొన్నారు.

'వెలిగొండ'కు రూ.2 వేల కోట్లు వెచ్చించాలి

- నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులివ్వని సిఎం
- సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

పశ్చిమ ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు సాగు నీరు, తాగు నీరు అందించేందుకు చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టుకు వెంటనే రెండు వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి-వెలిగొండ ప్రాజెక్టుపై ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో బుధవారం సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అధ్యయన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును పెంచరాదని డిమాండ్ చేశారు. కర్ణాటకలోని ఎగువ భద్ర ప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి, డిండీ ఎత్తిపోతల పథకాల నిర్మాణాలు నిలిపేయాలని, లేకపోతే ఉభయ తెలుగు రాష్ట్రాలకు నీటి కోసం తిప్పలు తప్పవని అన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం ఇచ్చంపల్లి నుండి కాకుండా పోలవరం కుడి కాలువ ద్వారా చేయాలని, దీనిపై కేంద్రంపై మన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ గండికోటలో 26 టిఎంసిల నీరు నిల్వ ఉన్నప్పటికీ కాలువలు సరిగా లేకపోవడంతో పొలాలకు నీరందడం లేదని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గత నాలుగేళ్లుగా నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా రాష్ట్ర చైర్మన్ ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మంది ఫ్లోరైడ్ బాధితులకు తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం నత్తనడకన సాగుతోందన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు కేశవరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి వెలుగొండ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని, వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను చేర్చాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, లోక్‌సత్తా అధ్యక్షులు ఎండి రఫీ అహ్మద్, తెలుగు రైతు నేత కామినేని వాసరావు, ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, ఒంగోలు సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా మధు, సుపరిపాలన వేదిక అధ్యక్షులు మాగులూరి నాగేశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల నేతలు, మేధావులు పాల్గొన్నారు.

దళితులపై దాడులకు నిరసనగా ఆందోళన



బుధవారం కాకినాడ కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న నిరసనకారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

శృంగవృక్షంలో దళితులపై దాడి చేసి, నడిపల్లి రామును హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద దళిత, ప్రజా సంఘాలు, వామపక్షాలు బుధవారం ఆందోళన చేపట్టాయి. తొలుత ఇంద్రపాలెం వంతెన వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్ కృతిక శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ అంబేరిస్ట్ అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల కాలంలో దళితులపై విపరీతంగా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హంతకులకు ప్రభుత్వ పెద్దలు కొమ్ముకాయడం సమంజసం కాదన్నారు. దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేయడంలో జాప్యం జరుగుతోందని, మరోవైపు వెంటనే బెయిల్ మంజూరు చేయడం వల్ల దళితుల్లో అభద్రతాభావం కలుగుతోందని పేర్కొన్నారు. బాధితులకు రక్షణ కల్పించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా నాయకులు దువ్వ శేషబాబ్జి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఆర్‌పిఐ రాష్ట్ర కార్యదర్శి పి.వరప్రసాద్, ఐఎన్‌టియుసి, మాలమహానాడు, ఎఐకెఎంఎస్, ఐఎఫ్‌టియు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

దోషులపై చర్యలు తప్పవు మంత్రి రాజా

- బాధిత కుటుంబానికి సాయం అందజేత

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లా తొండంగి మండలం శంగవక్షంలో ఇటీవల దళితులపై దాడి సంఘటనలో మరణించిన నడిపల్లి రాము కుటుంబాన్ని బుధవారం మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు, రెండెకరాల వ్యవసాయ భూమి, ఐదు సెంట్ల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి రూ.5 వేల పింఛను, మృతుని తల్లికి రెవెన్యూ శాఖలో ఉద్యోగం కల్పిస్తూ సంబంధిత పత్రాలను రాము కుటుంబ సభ్యులకు అందజేశారు.

దాడిలో గాయపడిన ఏడుగురికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. కేసుకు సంబంధించి నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపేందుకు తన వంతుగా కృషి చేస్తామని చెప్పారు. దాడితో సంబంధమున్న ప్రతి ఒక్కరిపైనా కేసు నమోదు చేసి, అరెస్టు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్ కృతికా శుక్లా, సాంఘిక సంక్షేమ శాఖ జెడి జె.రంగలక్ష్మీదేవి, వైసిపి నాయకులు ఉన్నారు.

పులివెందుల ఘటనలో తుపాకీ స్వాధీనం

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వ్యక్తిగత కారణాలతోనే కడప జిల్లా పులివెందులలో మంగళవారం కాల్పులు జరిగాయని పులివెందుల డిఎస్‌పి శ్రీనివాసులు తెలిపారు. నిందితుడు భరత్‌కుమార్ నుంచి తుపాకీ స్వాధీనం చేసుకున్నామన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాల్పుల్లో మరణించిన దిలీప్ భార్య భాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆర్థిక లావాదేవీలే ఈ ఘటనకు కారణమని వెల్లడించారు. మాజీ మంత్రి వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న సునీల్ యాదవ్ తమ్ముడు భరత్‌కుమార్ అని వివరించారు. 2019లో భరత్‌పై హత్యాయత్నం జరిగిందని, రక్షణ కోసం తుపాకీ లైసెన్సుకు దరఖాస్తు చేసుకున్నాడని చెప్పారు. అప్పటి పరిస్థితుల కారణంగా తుపాకీ లైసెన్స్ ఇచ్చామని తెలిపారు. శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరి 26న భరత్ నుంచి తుపాకీ స్వాధీనం చేసుకున్నామని, ఎన్నికల అనంతరం మార్చి 24న తిరిగి అప్పగించామని చెప్పారు. ఆయన తుపాకీ లైసెన్స్ రద్దు కోసం ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. దర్యాప్తు పూర్తయిన వెంటనే కేసుకు సంబంధించి కారణాలను తెలియజేస్తామన్నారు.


దిలీప్ బంధువులను శాంతింపజేస్తున్న సిఐ బాలమద్దిలేటి

భరత్ యాదవ్‌ను కఠినంగా శిక్షించాలి : దిలీప్ కుటుంబం

భరత్ కుమార్‌ను కఠినంగా శిక్షించాలని, కాల్పుల్లో మృతి చెందిన దిలీప్ కుటుంబ సభ్యులు, స్నేహితులు డిమాండ్ చేశారు. పోస్టుమార్టం అనంతరం దిలీప్ మృతదేహాన్ని బుధవారం ఆయన నివాసానికి తరలించారు. భరత్‌ను కఠినంగా శిక్షించాలని, లేదా తమకు అప్పగించాలని అంతవరకూ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించబోమని, నిర్వహిస్తే అది భరత్ కుమార్ ఇంటిలోనే నిర్వహిస్తామని వారు పట్టుబడ్డారు. దిలీప్ బంధువులు, స్నేహితులతో పోలీసులు మాట్లాడారు. అనంతరం మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

చిత్తూరుకు 'మహబూబ్ బాషా'

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

కడప జిల్లా పులివెందులలో తుపాకీ కాల్పుల్లో గాయపడిన మహబూబ్‌బాషా అలియాస్ మస్తాన్‌బాషాను చికిత్స నిమిత్తం చిత్తూరు జిల్లా కేంద్రమైన కొంగారెడ్డిపల్లిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యం అనంతరం డాక్టర్ భరత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మహబూబ్ బాషాకు ఎడమచేయి మోచేతి కింద భాగాన తూటా తగలడంతో బలమైన గాయాలయ్యాయన్నారు. చేతి ఎముక పూర్తిగా దెబ్బతిందని చెప్పారు. తొడ భాగంలో తూటా విడిభాగాలు దూసుకుపోవడంతో తీవ్రంగా గాయమైందని తెలిపారు. మహబూబ్ బాషా ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందన్నారు.

చంద్రబాబు నాయకత్వంలో ఓటములే ఎక్కువ

- ఎమ్మెల్యే కొడాలి నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపికి ఎన్‌టిఆర్ నాయకత్వంలో విజయాలు ఎక్కువుంటే.. చంద్రబాబు నాయకత్వంలో ఓటములే ఎక్కువని ఎమ్మెల్యే కొడాలి నాని విమర్శించారు. పేద ప్రజల శ్రేయస్సు కోసం ఎన్‌టిఆర్ స్థాపించిన పార్టీని వెన్నుపోటుతో లాక్కుని ఓట్లకోసం ఇప్పుడు దండలు వేస్తున్నారని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్‌టిఆర్ బతికున్నప్పుడు చెప్పులేసిన నాయకులు ఇప్పుడు దండలు వేయడం సిగ్గుచేటన్నారు. ఎన్‌టిఆర్ పెట్టిన సంక్షేమ పథకాలన్నిటినీ నాశనం చేసి పార్టీని వ్యాపార సంస్థగా మార్చారన్నారు. రాష్ట్రంలో ఎన్‌టిఆర్ తర్వాత ప్రజల హృదయాలను గెలిచిన నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డేనని పేర్కొన్నారు. ఆ తర్వాత జగన్‌కే అంత ఆదరణ ప్రజలో ఉందన్నారు.

ఎన్ఇపి అమలు దారుణం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్

ప్రజాశక్తి - తణుకు రూరల్

దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలు సహా ఎక్కడా అమలు చేయని జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)ను మన రాష్ట్రంలో అమలు చేయడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్ అన్నారు. పశ్చిమగోదావరి జిలాల తణుకు పట్టణంలోని మెడికల్ యూనియన్ హాలులో రెండు రోజులుగా జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్ఇపి అమలు వల్ల రాష్ట్రంలో కొన్ని వేల పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా అనేక మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే విధంగా ఎన్ఇపి ఉందని అన్నారు. ఎన్ఇపిని ఎస్ఎఫ్ఐ వ్యతిరేకిస్తోందని తెలిపారు. సంవత్సరానికి నాలుగు విడతల్లో వేయాల్సిన జగనన్న విద్యా దీవెన డబ్బులు గత రెండేళ్లుగా పూర్తి స్థాయిలో వేయడంలేదని, ఫలితంగా కాలేజీలకు విద్యార్థులే సొమ్ము చెల్లిస్తున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న జగనన్న విద్యా దీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇంటర్ విద్యలో కార్పొరేట్ విద్యాసంస్థలు చెలరేగిపోతున్నాయన్నారు. కొన్ని కాలేజీలు లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని, మరికొన్ని కాలేజీల్లో యాజమాన్యం ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. అటువంటి కార్పొరేట్ కాలేజీల గుర్తింపును రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఎస్ఎఫ్ఐ చేపట్టబోయే కార్యాచరణ గురించి ఈ సమావేశాల్లో చర్చిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్, సహాయ కార్యదర్శి డి పెద్దిరాజు, కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని, రాష్ట్ర నాయకులు వనిత, పి రామ్మోహన్, కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయవంతంగా సారెక్స్-2023

ముగిసిన కోస్ట్ గార్డ్ మాక్ డ్రిల్

ప్రజాశక్తి-కాకినాడ


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న కోస్ట్‌గార్డ్

కాకినాడ సముద్రపు ఒడ్డు నుంచి 20 కిలో మీటర్ల దూరంలో నిర్వహించిన ఇండియన్ కోస్ట్‌గార్డ్-రీజనల్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఎక్సర్‌సైజ్ (సారెక్స్-2023) విజయవంతమైనట్టు కాకినాడ కోస్ట్‌గార్డ్ స్టేషన్ కమాండెంట్ టిఆర్‌కె రావు తెలిపారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్-కాకినాడ స్టేషన్ ఆధ్వర్యాన సముద్రంలో విపత్తు స్పందన, నిర్వహణపై బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. చమురు నౌకలో అగ్ని ప్రమాదం సంభవించగా మంటలను అదుపులోకి తెచ్చి నౌక సిబ్బందిని, ప్రయాణికులను రక్షించేందుకు కోస్ట్‌గార్డ్ చూపిన ధైర్యసాహసాలు, శక్తిసామర్థ్యాలకు ఈ మాక్ డ్రిల్ ప్రతిబింబంగా నిలిచింది. సముద్రంలో పడిపోయిన వారిని స్పీడ్ బోట్లతో రక్షించడం, చేతక్ హెలికాప్టర్‌తో గజ ఈతగాళ్లను సముద్రంలోకి దింపడం, ప్రమాదంలో ఉన్న వారిని రక్షించి, మెడికల్ నౌకలోకి చేర్చడం వంటి వాటిని ప్రదర్శించారు. మాక్ డ్రిల్‌లో రిమోట్‌తో పని చేసే లైఫ్ బోట్లు ఆకట్టుకున్నాయి. కమాండెంట్ టిఆర్‌కె.రావు మాట్లాడుతూ భారత తీరప్రాంత గస్తీ దళం ప్రపంచంలో అత్యుత్తమ తీరప్రాంత రక్షణ దళాల్లో ఒకటిగా కొనసాగుతోందన్నారు. సహజ విపత్తులు లేదా ప్రమాదవశాత్తు నౌకల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా చూసేందుకు కోస్ట్‌గార్డ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

ముందే వెళ్లిపోయిన 'కువైట్' విమానం

- ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)

కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయం నుంచి కువైట్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం అధికారుల నిర్వాకంతో అనుకున్న సమయం కంటే ముందుగానే వెళ్లిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విమానం బయలుదేరే సమయాన్ని మార్పు చేసిన విషయం తెలియజేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల 17 మంది ప్రయాణికులు కువైట్ వెళ్లే అవకాశం లేక విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. గుంటూరు, ఉభయగోదావరి జిల్లాలు, ఇతర ప్రాంతాల నుండి 84 మంది ప్రయాణికులు కువైట్ వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్నారు. విమానం ఉదయం 9.50 గంటలకు గన్నవరం నుంచి కువైట్‌కు 67 మందితో విమానం బయలుదేరి వెళ్లింది. ఫ్లైట్ వెళ్లిన కొద్ది సేపటికి కువైట్ వెళ్లేందుకు 17 మంది ప్రయాణికులు వచ్చారు. మధ్యాహ్నం 1.05 గంటలకు వెళ్లాల్సిన విమానం ముందే వెళ్లడం ఏమిటని ఎయిర్ ఇండియా సిబ్బందిని నిలదీశారు. విమానం 9.55 గంటలకే బయలుదేరుతుందని మెసేజ్‌లు పెట్టామని సిబ్బంది తెలిపారు. తమకు ఎలాంటి మెసేజ్‌లూ రాలేదని సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

పోలవరం అయోమయం

ఆంధ్ర సీమకు జీవనాడిగా అభివర్ణించే పోలవరం జాతీయ ప్రాజెక్టుపై కేంద్ర బిజెపి ప్రభుత్వం పూటకోమాట చెబుతూ గందరగోళం సృష్టిస్తోంది. నిర్మాణ పనులు, నిర్వాసితుల సహాయ, పునరావాసం అడుగు ముందుకు పడని దయనీయ స్థితి ఉండగా, కేంద్రం చేస్తున్న గజిబిజితో ప్రాజెక్టు మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. గడచిన వారం రోజుల్లో పార్లమెంట్‌లో కేంద్ర మంత్రుల ప్రకటనలు దోబూచులాడగా, నిధుల విషయమై తాజాగా విత్త మంత్రిత్వశాఖ రాష్ట్ర సర్కారుకు పంపిన లేఖ మరింత అయోమయంలో పడేసింది. పూర్తి చేసిన పనులకుగాను రూ.828 కోట్లు విడుదల చేస్తూ, ఇంకా ఇవ్వాల్సింది రూ.1,249 కోట్లేనని బాంబు పేల్చింది. 2013-14 ధరల ప్రకారం రూ.20 వేల కోట్ల అంచనాకే కట్టుబడి ఉన్నట్లు మరోమారు స్పష్టం చేసింది. సవరించిన సవివర ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) మేరకు ఇంకా కనీసం రూ.30 వేల కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించగా ఆ ప్రస్తావన చేయలేదు. అంతకుముందు పార్లమెంట్‌లో ఇద్దరు జలశక్తి మంత్రులు ప్రాజెక్టు ఎత్తుపై తలొక మాటా మాట్లాడారు. లోక్‌సభలో మంత్రి ప్రహ్లాద్‌సింగ్ జోషి సమాధానమిస్తూ తొలి దశలో ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లేనన్నారు. రాజ్యసభలో మరో మంత్రి బిశ్వేశ్వర్ తుడు జవాబు చెబుతూ గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ఎత్తు 45.72 మీటర్లుగా చెప్పుకొచ్చారు. కొత్త డిపిఆర్‌పై దాటవేశారు. విభజన చట్టం ద్వారా జాతీయ హోదా సంతరించుకున్న ప్రాజెక్టుపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరు దాని బాధ్యతారాహిత్యాన్ని తెలుపుతుంది.

పోలవరాన్ని ఆది నుంచీ కేంద్రం వివాదాస్పదం చేస్తోంది. ఇరిగేషన్ కాంపోనెంట్‌నే భరిస్తాం నిర్వాసితుల విషయం తమకు సంబంధం లేదని భీష్మిస్తోంది. ప్రాజెక్టు అంటేనే నిర్వాసితులతో కలిపే ఉంటుంది. కేంద్రం ఈ అంతర్జాతీయ సహజ న్యాయ సూత్రాన్ని విస్మరించడం అమానవీయం. ప్రతిపాదిత ఎత్తులో ప్రాజెక్టును నిర్మిస్తే 1.06 లక్షల కుటుంబాలు నిర్వాసితులవుతున్నాయి. అత్యధికులు గిరిజనులే. కాంటూరు లెక్కల్లో శాస్త్రీయత లేదనడానికి మొన్న గోదావరికి వచ్చిన వరదలే ఉదాహరణ. అంచనాలను దాటి ఎక్కువ ప్రాంతాలు కొద్దిపాటి వరదలకే మునిగాయి. పునరావాస కాలనీలు సైతం మునిగాయి. కాంటూరు లెక్కలు తప్పుల తడకలని తేలిపోయింది. ప్రభుత్వ గణాంకాల బట్టి చూసినా ఇప్పటికి 22 శాతానికే పునరావాసం పూర్తయింది. అదీ అసంపూర్తిగానే. జాతి అభివృద్ధికి తమ సర్వస్వం ధారపోసిన లక్షలాది నిర్వాసితుల పునరావాసాన్ని గాలికొదిలేయడం హేయం.

పోలవరానికి కేంద్రం కల్పిస్తున్న అడ్డంకులపై నిలదీసి పోరాడి నిధులు సాధించి సకాలంలో ప్రాజెక్టును పూర్తి చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అంటిముట్టనట్లుంటోంది. కేంద్రం వద్దకెళ్లి నిధులడుగుతున్నాం అని చెపుతున్నారంతే. మొన్న అసెంబ్లీ సాక్షిగా చేసిన పనులకు రూ.2,600 కోట్లు కేంద్రం చెల్లించాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వెల్లడించగా, కేంద్రం ఇచ్చింది 828 కోట్లు మాత్రమే. కొత్త డిపిఆర్ ఆమోదానికి సమయం పడుతుంది కాబట్టి ఆలోపు అత్యవసరంగా రూ.15 వేల కోట్లివ్వండని అడగ్గా, కొత్త డిపిఆర్‌ను బుట్టదాఖలు చేశామని కేంద్రం లేఖ పంపింది. అలాగే 2005 అనంతరం 18 ఏళ్లు నిండిన నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వడం సాధ్యం కాదంది. కేంద్రం రాష్ట్రానికి ఈ విధంగా అన్యాయం చేస్తున్నా గట్టిగా ఒత్తిడి ఎందుకు చేయరో తెలీదు. నిర్వాసితుల పునరావాసంపై తొలిదశ, మలిదశ, అని వక్ర భాష్యాలు చెపుతున్న కేంద్రానికి రాష్ట్ర సర్కారు వంత పాడటం అభ్యంతరకరం. 2017-18 ధరలకనుగుణంగా రాష్ట్రం రూ.55 వేల కోట్లకు కొత్త డిపిఆర్ పంపగా సాంకేతిక సలహా మండలి ఆమోదించింది. రివైజ్డ్ కాస్ట్ కమిటీ రూ.47 వేల కోట్లకు కుదించింది. నిర్వాసితుల పునరావాసానికే రూ.30 వేల కోట్లు కావాలి. ఈ భాగాన్ని ఎగ్గొట్టేందుకు కేంద్రం పన్నాగం పన్నుతోంది. రాష్ట్రం గమ్మునుంది. నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించాకే ప్రాజెక్టులు పూర్తి చేయాలన్న అంతర్జాతీయ నిబంధనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటించి ప్రాజెక్టును పూర్తి చేయాలి. ఎన్నికల వాగ్దానం ప్రకారం రాష్ట్ర సర్కారు నిర్వాసితులకు రూ.10 లక్షల ప్యాకేజీ ఇవ్వాలి.

మహనీయుల మాట




సోషలిజానికి సార్వజనీన మార్గాలు, సార్వజనీన నమూనాలు అంటూ ఏమీ లేవు. ఆయా దేశాల గడ్డలపై గల నిర్దిష్ట పరిస్థితుల్లో, నిర్దిష్ట కాలమానాల్లో సోషలిజం పెరగాలి.

- శ్యామ్ వెబ్,
అమెరికా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు.

విశాఖ స్టీల్ పోరాటం ప్రభుత్వ రంగ రక్షణలో భాగమే

సమస్య

దేశంలోని అన్ని స్టీల్‌ప్లాంట్లకు ఇనుప ఖనిజం లభిస్తున్నది. అందరి కంటే ఎక్కువ ధరకు మార్కెట్‌లో కొనుక్కొనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ముడి ఖనిజం అందుబాటులో ఎందుకు లేదు? అన్ని స్టీల్‌ప్లాంట్లకు ముడి ఖనిజం, బొగ్గు సప్లయ్ చేసే రైల్వే ర్యాక్‌లు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు లభ్యం కావు? గత 30 సంవత్సరాల నుంచి ఉత్పత్తికి కావలసిన పెట్టుబడులకు ఎన్నడూ కొదవలేదు. కానీ గత సంవత్సరంలో రూ.945 కోట్లు లాభాలు వచ్చినా ముడిసరుకు కొనడానికి పెట్టుబడులు లేవనే వంకతో నేడు యాజమాన్యం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఐఓపి)ని ఏకపక్షంగా ప్రకటించింది. ప్రైవేటు వారిని ఏదో రూపంలో దూర్చడానికి బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని అధికారులు, కార్మికులు భావిస్తున్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని కుట్ర చేస్తున్నా రాష్ట్రం లోని అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్, ప్రతిపక్ష తెలుగుదేశం తగినట్లుగా స్పందించడం లేదు. ఈ పార్టీల ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ప్రశ్నలు వేస్తున్నారు. కేంద్ర బిజెపి తప్పుడు సమాచారంతో వీరి నోరు మూయిస్తున్నది. రాష్ట్ర ప్రజలను బిజెపి పక్కదారి పట్టించి గందరగోళ పరుస్తున్నది. విశాఖ స్టీల్‌ప్లాంట్ లోని 4 వేల ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని వైసిపి డిమాండ్ చేస్తోంది. పోస్కో, అదానీలకు విశాఖ స్టీల్‌ప్లాంట్, అందులోని మిగిలిన భూములను రాష్ట్ర ప్రభుత్వం దొంగలు దొంగ లు ఊళ్ళు పంచుకున్న ట్లుగా పంచుకోవాలని పన్నాగాలు పన్నుతున్నారు. వాస్తవ రాజకీయ పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకొని ఏప్రిల్ 1న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని కోరుతున్నాం.



సిహెచ్. నరసింగరావు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం 27.1.2021న నిర్ణయించింది. అప్పటి నుండి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 26 నెలల నుంచి నిరవధిక పోరాటం సాగుతున్నది. విశాఖ నగరంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్షలు ప్రారంభించి ఏప్రిల్ 1వ తేదీకి 700 రోజులు కావస్తున్నది. ఆ రోజున విశాఖలో భారీ మానవ హారం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని రాష్ట్ర కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు పిలుపు నిచ్చాయి. ఈ పోరాట ఫలితంగానే నేటకీ ఒక్క శాతం కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్ వాటాలు అమ్మకుండా అడ్డుకోగ లిగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం పూర్తియ్యే నాటికి సరళీకరణ విధానాలు దేశంలో ప్రారంభమైనాయి. అప్పటి నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పెట్టుబడులు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వాలు నిరాకరించాయి. కేవలం రూ.5 వేల కోట్లు పెట్టుబడులతో కేంద్ర ప్రభుత్వం నిధులు ఆపేసింది. కానీ విశాఖ స్టీల్ తమ సొంత లాభాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను ఒక మిలియన్ టన్నుల నుంచి 7.2 మిలియన్ టన్నుల సామర్ధ్యానికి విస్తరించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ సుమారుగా రూ.50 వేల కోట్ల పన్నులు, డివిడెండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించింది. 2000 సంవత్సరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌కు అమ్మాలన్న నాటి వాజ్‌పేయి ప్రభుత్వ ప్రయత్నాలను స్టీల్ కార్మికులు పోరాటాలతో వమ్ము చేశారు.



> **కేంద్ర బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని కుట్ర చేస్తున్నా రాష్ట్రం లోని అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్, ప్రతిపక్ష తెలుగుదేశం తగినట్లుగా స్పందించడం లేదు. ఈ పార్టీల ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ప్రశ్నలు వేస్తున్నారు. కేంద్ర బిజెపి తప్పుడు సమాచారంతో వీరి నోరు మూయిస్తున్నది. రాష్ట్ర ప్రజలను బిజెపి పక్కదారి పట్టించి గందరగోళ పరుస్తున్నది. విశాఖ స్టీల్‌ప్లాంట్ లోని 4 వేల ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని వైసిపి డిమాండ్ చేస్తోంది. పోస్కో, అదానీలకు విశాఖ స్టీల్‌ప్లాంట్, అందులోని మిగిలిన భూములను రాష్ట్ర ప్రభుత్వం దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్లుగా పంచుకోవాలని పన్నాగాలు పన్నుతున్నారు.**

భారతదేశంలో స్వాతంత్ర్యం అనంతరం సోషలిస్ట్ దేశాల సహాయంతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల స్థాపనతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాం. భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ప్రభుత్వ రంగ పరిశ్రమలు ముందు పీఠిన నిలబడ్డాయి. దేశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలు పారిశ్రామిక ప్రాంతాలుగా ఎదిగి నేడు అభివృద్ధి ప్రాంతాలుగా మారాయి. ఉపాధి భారీగా పెరిగింది. ఎస్‌టి, ఎస్‌సి, బిసి లకు ఉపాధి లభించింది. అభివృద్ధి చెందిన ప్రభుత్వ రంగాన్ని అమాంతంగా మింగేయడానికి పాలకవర్గం 1991 నుంచి సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టింది. గతంలో కాంగ్రెస్, నేడు బిజెపి పోటీ పడి మరీ ఈ విధానాలను అమలు చేస్తున్నాయి.

దేశ సంపదైన భూములు, గనులు, భారీ పరిశ్రమలు, సముద్ర తీరాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. "పరిశ్రమలను నడపం. భారీ పరిశ్రమలన్నింటిని అమ్మేస్తాం లేదా మూసివేస్తాం" అనే తప్పుడు విధానాన్ని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లోనే ప్రకటించింది. ఈ విధానాలను అమలు చేయడానికి నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నది. భారీ పరిశ్రమలను స్వదేశీ, విదేశీ కంపెనీలకు కారుచౌకగా అమ్మడం దేశద్రోహం. రాష్ట్రంలోకెల్లా భారీ పరిశ్రమలకు మణిహారమైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దక్షిణ కొరియా పోస్కోకు, అదానీకి అమ్మేపనిలో బిజెపి కేంద్ర ప్రభుత్వం నేడు తలమునకలుగా వున్నది.

దేశంలో అన్ని ప్రైవేట్, ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నాయి. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ని పోరాటాలు చేసినా సొంత గనులను కేంద్ర ప్రభుత్వాలు ఇవ్వడానికి నిరాకరించాయి. సొంత గనులున్న స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో కలపడానికి కేంద్ర ప్రభుత్వం మోకాలు అడ్డుతున్నది. పార్లమెంట్‌లో నిరాకరిస్తూ సమాధానం చెప్పింది. దీనివలన సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్‌కు ఒక్క టన్ను ఇనుప ఖనిజం రూ. 700 అయితే...విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో టన్ను రూ. 5 వేల నుంచి రూ. 7 వేలకు కొనవలసి వస్తున్నది. దేశంలో ఏ స్టీల్‌ప్లాంట్‌కు పక్కనే సముద్రం లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పోర్టు నిర్మించడానికి తీసుకున్న భూములతో సహా ఉచితంగా గంగవరం పోర్టును ప్రైవేట్‌వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్పగించాయి. పక్కనే సముద్రం వున్నా ఆ ఆదాయాలు అదానీకి సొంతమయ్యాయి. నేడు సాలీనా 7.2 మిలియన్ల సామర్థ్యం వున్నప్పటికీ 4.5 మిలియన్ల టన్నుల సామర్థ్యంతోనే విశాఖ స్టీల్ నడుస్తోంది. కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ లోని కీలకమైన విభాగాల్లో ఉత్పత్తిని భారీగా తగ్గించి నష్టాల్లోకి నెట్టింది.

దేశవ్యాప్తంగా కిసాన్ మోర్చా, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలు మనకు ఆదర్శం. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలి. విశాఖ స్టీల్‌కు సొంత గనులు కేటాయించాలి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలి. ఈ డిమాండ్లను సాధించేవరకు విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాటం నిరంతరంగా కొనసాగుతుంది.

/వ్యాసకర్త విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్/

సమస్య

టోల్ పన్ను పెంచడం న్యాయమా?

దేశంలోని అన్ని రకాల వాహనాలు టోల్ ప్లాజా ద్వారా వెళుతూ టోల్ పన్ను చెల్లిస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. రోడ్లు నిర్మించినందుకు తిరిగి రావలసిన పెట్టుబడిని లాభంతో సహా కాంట్రాక్టరు రాబట్టుకోవడానికి టోల్ పన్నులను వసూలు చేస్తున్నట్లు మనం నమ్ముతున్నాం. ఇది నిజమేనా? వాస్తవానికి రహదారుల అభివృద్ధి సెస్ పేరుతో ప్రతి లీటర్ పెట్రోల్ పైన రూ.5, ప్రతి లీటరు డీజిల్ పైన రూ.2 అదనంగా వసూలు చేస్తున్నారు. 2017-18 బడ్జెట్ కాలం నుండి మోడీ ప్రభుత్వం దీన్ని 'రోడ్డు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్'గా మార్చేసింది. దీని అర్థం ఏమంటే ఈ మొత్తాన్ని రోడ్డు నిర్మాణానికి, నిర్వహణకు ఉపయోగించాలి. పెట్రోలియం ప్రణాళిక, విశ్లేషణ శాఖ లెక్కల ప్రకారం (పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ) 2021-22 ఆర్థిక సంవత్సరంలో 30,849,000 మెట్రిక్ టన్నుల పెట్రోలు, 76,659,000 మెట్రిక్ టన్నుల డీజిల్ అమ్ముడుపోయింది. దానిపై ప్రభుత్వం రోడ్డు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్ కింద 2,70,000 కోట్ల రూపాయలు వసూలు చేసింది. ఇదే ఆర్థిక సంవత్సరంలోనే సుమారు 1000 టోల్ ప్లాజాల ద్వారా 34,778 కోట్ల రూపాయలను కూడా వసూలు చేసింది. మౌలిక వసతుల అభివృద్ధి సెస్ వసూలు చేసిన తర్వాత మరలా టోల్ పన్ను వసూలు చేయడం ఏ విధంగా న్యాయం? పన్ను ఎంత వసూలు చేసింది, ఎంత ఖర్చు చేసింది అనే విషయంలో పారదర్శకత లేదు. చివరకు ప్రభుత్వం టోల్ రేట్ నిర్ణయించే ముందు లేదా దానిని పెంచే ముందు నోటీసు ఇచ్చి ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. కానీ అవేమీ చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం చేస్తున్నారు.

ఇక రెండో విషయం ఏమంటే...రోడ్ల మీద ప్రతి రోజు ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి? ఎన్ని సంవత్సరాలు లాభంతో కూడిన పెట్టుబడిని టోల్ పన్ను ద్వారా తిరిగి వసూలు చేసుకోవాలి? అంచనా వేసి టోల్ చార్జీలు నిర్ణయించాలి. నిర్దిష్ట కాల పరిమితి తర్వాత టోల్ పన్ను వసూళ్లను నిలిపివేయాలి. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే చాలా టోల్ ప్లాజాలు వారి నిర్ణీత గడువు కాలం దాటినా ఇంకా టోల్ పన్నును వసూలు చేస్తూనే ఉన్నాయి. అదేవిధంగా ప్రభుత్వం (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా-ఎన్.హెచ్.ఎ.ఐ) టోల్ చార్జీలను ప్రతి సంవత్సరం పెంచుతూనే ఉన్నది. ఎన్.హెచ్.ఎ.ఐ ఇప్పటికే ఈ ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి టోల్ చార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇది ప్రజలను తప్పుదారి పట్టించి దోపిడీ చేయడమే. భారత ప్రభుత్వం ప్రజలపై ఈ విధంగా దాడి చేస్తున్నప్పుడు మనం మౌనంగా, స్పందించకుండా, ప్రశ్నించకుండా ఉండగలమా?

వాహన యజమానులు, ప్రజలు మార్చి 31వ తేదీన మధ్యాహ్నం 12.00 గంటల నుండి 12.10 గంటల వరకు (పది నిమిషాల పాటు) వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేసి నిరసన తెలియజేయాల్సిందిగా విజ్ఞప్తి.



- ఆర్. లక్ష్మయ్య,
ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి.

పరువు నష్టం నేరం కాకూడదు

విశ్లేషణ

బహిరంగ సభల్లో మాట్లాడడం రాజకీయ కార్యకలాపాలలో ఒక భాగం. రాహుల్ గాంధీ బహిరంగ సభలో చేసిన ప్రసంగంలోని కొన్ని మాటలను పట్టుకుని ఆయనపై క్రిమినల్ పరువు నష్టం దావా వేసి రెండేళ్లు జైలు శిక్ష పడేలా చేశారు. నేడు రాహుల్ విషయంలో జరిగినట్టే రేపు ఎవరికైనా జరగొచ్చు. పరువు నష్ట నేరంగా పరిగణించే వలస పాలకుల కాలం నాటి పరువు నష్ట చట్టం, ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద రెండేళ్ళ జైలు శిక్షతో ఆరేళ్లపాటు ప్రతినిధులను అనర్హులుగా ప్రకటించవచ్చు. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛను భయానకంగా మారుస్తుంది.

1860లో రూపొందించబడిన భారతీయ పరువు నష్టం చట్టాన్ని ఎవరిపైనైనా ప్రయోగించడం బ్రిటిష్ కాలంలో కన్నా ఘోరంగా మారింది. సూరత్‌లో ఒక మేజిస్ట్రేట్ ఒక పార్లమెంటేరియన్‌ను పరువు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఎంపీ సభ్యత్వానికే అనర్హుడిగా ప్రకటించేందుకు వీలు కల్పించేలా గరిష్ట శిక్ష విధించారు. అటువంటి న్యాయాధికారుల కొరత లేని దేశంలో, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచేలా పరువునష్టాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించకూడదు.



సెబాస్టియన్ పాల్

2016లో, వాక్ స్వాతంత్ర్యానికి ఆటంకం కలిగించే పరువు నష్టాన్ని నేరంగా పరిగణించడాన్ని తొలగించాలన్న డిమాండ్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. పిటిషనర్లలో సుబ్రమణ్య స్వామి, అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు రాహుల్ గాంధీ కూడా ఉన్నారు. దీపక్ మిశ్రా, పి.సి.పంత్‌లతో కూడిన ధర్మాసనం రాజ్యాంగ ధర్మాసనానికి వదిలేయాల్సిన అంశంపై పెద్దగా ప్రాధాన్యం లేకుండా నిర్ణయం తీసుకుందన్న విమర్శలు వచ్చాయి. శ్రీలంక కూడా పరువు నష్టాన్ని నేరంగా పరిగణించని సమయంలో భారత సుప్రీంకోర్టు ఇటువంటి తిరోగమన వైఖరి తీసుకుంది. ప్రజాస్వామ్యానికి జీవనాడి అయిన వాక్ స్వాతంత్ర్యాన్ని వ్యక్తి గౌరవం పరిరక్షణ పేరుతో పరిమితులు విధించారు. పరువు నష్టం పౌర చట్టం ప్రకారం పరిష్కరించబడుతుంది కాబట్టి పరువు నష్టాన్ని నేరంగా పరిగణించరాదన్న డిమాండ్ సహేతుకమైనది.

హెన్రీ VIII కోర్ట్ ఆఫ్ స్టార్ ఛాంబర్ అధికార ధిక్కారాన్ని నిరోధించడానికి అపవాదు క్రిమినల్ నేరాన్ని ప్రవేశపెట్టింది. బ్రిటిష్ ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం అధికారాన్ని అగౌరవపరచడం దేశద్రోహం. మన న్యాయ వ్యవస్థ రాజ్యాంగబద్ధంగా ఉండాలంటే, దేశద్రోహం, పరువు నష్టం వంటి పురాతన నేరాలను శిక్షాస్మృతి నుండి తొలగించాలి.

2019లో లోక్‌సభకు ఎన్నికైన వారిలో 30 శాతం మంది అవినీతి, హత్య వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారున్నారని సర్వేలు తెలియజేస్తున్నాయి. వాక్య నిర్మాణంలో లోపం వల్ల రాహుల్ గాంధీని క్రిమినల్ పరువునష్టం కేసులో ఇరికించి ఆయనను పదవీచ్యుతుణ్ణి చేశారు. అంతకన్నా దారుణమైన విషపూరితమైన ప్రకటనలు చేసినవారిపై చట్టపరమైన ఎలాంటి చర్యలు ఉండవు. విమర్శను, హాస్యాన్ని నేరంగా పరిగణించే ప్రస్తుత పరిస్థితుల్లో రాహుల్ గాంధీకి విధించిన శిక్ష అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రజాస్వామ్య ప్రపంచ సూచీలో అవమానకరంగా అట్టడుగున ఉన్న భారతదేశ స్థాయిని మరింత తగ్గించడానికి ఇటువంటి చర్యలు దోహదం చేస్తాయి.

నేరం, శిక్ష సరిపోలాలి. రాహుల్ గాంధీ విషయంలో ఒక స్పష్టమైన లక్ష్యంతో నేరం తీవ్రతకు మించిన శిక్ష విధించబడింది. ప్రజాప్ర తినిధులకే ఇటువంటి పరిస్థితి దాపురిస్తే, ఇక సామాన్యుల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహించు కోవచ్చు. ఎం.ఎఫ్. హుస్సేన్, ఖుష్బు అనవసరంగా పరువు నష్టం కేసుల్లో చిక్కుకున్నారు. ఖుష్బుపై వివిధ కోర్టుల్లో 23 కేసులు దాఖలయ్యాయి. ఒక వ్యాఖ్య కారణంగా నేను ఐదు కోర్టులలో పరువు నష్టం కేసును ఎదుర్కొంటున్నాను. తుది తీర్పు కంటే ప్రతివాదిగా కోర్టుల ద్వారా వెళ్లడం బాధాకరమైన అనుభవం.



> **వాక్య నిర్మాణంలో లోపం వల్ల రాహుల్ గాంధీని క్రిమినల్ పరువునష్టం కేసులో ఇరికించి ఆయనను పదవీచ్యుతుణ్ణి చేశారు. అంతకన్నా దారుణమైన విషపూరితమైన ప్రకటనలు చేసినవారిపై చట్టపరమైన ఎలాంటి చర్యలు ఉండవు. విమర్శను, హాస్యాన్ని నేరంగా పరిగణించే ప్రస్తుత పరిస్థితుల్లో రాహుల్ గాంధీకి విధించిన శిక్ష అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రజాస్వామ్య ప్రపంచ సూచీలో అవమానకరంగా అట్టడుగున ఉన్న భారతదేశ స్థాయిని మరింత తగ్గించడానికి ఇటువంటి చర్యలు దోహదం చేస్తాయి.**

పీనల్ కోడ్ నుంచి ఆర్టికల్ 499ని తొలగించాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాహుల్ గాంధీ...తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేకపోయారు. తన తండ్రి ప్రధానిగా ఉన్నప్పుడు పరువు నష్టం చట్టం పరిధిని పెంచే ఎత్తుగడ జరిగింది. బోఫోర్స్‌పై నిప్పులు చెరిగిన తర్వాత రాజీవ్ గాంధీ తనను తాను రక్షించుకోవడానికి, ప్రెస్‌ను తటస్థీకరించడానికి కనుగొన్న మార్గం. లోక్‌సభలో విపక్షాలు బలంగా ఉండటంతో బిల్లును ఆమోదించినప్పటికీ, దానిని ఉపసంహరించుకున్నారు. రాజీవ్ గాంధీ అపఖ్యాతి పాలైన తపాలా బిల్లు విషయంలోనూ అదే జరిగింది.

అనుసరించే వారే కాదు, తవ్వే వారు కూడా ఒక్కోసారి గోతిలో పడిపోతుంటారు. అనర్హత వేటు తీర్పు తక్షణం అమల్లోకి రాకుండా ఆర్డినెన్స్‌ను చించివేసిన వ్యక్తి రాహుల్ గాంధీ. అప్పటి చట్టం ఉంటే రాహుల్ గాంధీకి ఈ గతి ఉండేది కాదు.

పొరపాటున నోరు జారడం వల్ల వచ్చిన సమస్య ఇది. ఈ లోపం తీవ్రమైన సంక్షోభాన్ని కలిగించకూడదు. ఏం జరుగుతుందోనని భయపడకుండా మాట్లాడగలగాలి. ప్రాణాలకు రక్షణ, ఆస్తులకు రక్షణ మాదిరిగా పోలీసు స్టేషన్, క్రిమినల్ కోర్టుల్లో ప్రతిష్టను కాపాడలేం. ఎవరైనా చెప్పిన దాని ఆధారంగా పరువు పోగొట్టుకున్నారని ఆరోపించిన వారు గౌరవ మూల్యం చెల్లించి సివిల్ కోర్టును ఆశ్రయించాలి.

ప్రజాప్రతినిధులకు వర్తించే అనర్హత చట్టంలోని అసమంజసమైన కఠినత్వాన్ని తగ్గించడమే కాకుండా వాక్ స్వాతంత్ర్య ప్రయోజనాలను కాపాడేందుకు కూడా ఇది అవసరం. అమెరికాలో పరువు నష్టం నేరం కాదు. బ్రిటన్‌లో లిఖిత పూర్వకంగా వున్నది తప్ప మౌఖికంగా వున్నది నేరపూరితం కాదు.

కోర్టు ఆదేశాలను అనుసరించి అనర్హత అంటే తెలిసిన విషయమే. కానీ రాహుల్ గాంధీ విషయంలో తొందరపాటున జరిగింది. రాహుల్ గాంధీని నిష్పక్షపాత న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించే అవకాశం ఉన్న కేసులోనే ఆయనకు శిక్ష పడింది. మేజిస్ట్రేట్ తొందరపాటు దేశ వ్యవహారాలను ప్రభావితం చేయకూడదు.

అనర్హతకు కారణం నేరం కాదు శిక్షే. ముప్పై రోజుల పాటు శిక్షపై స్టే విధించారు. ప్రస్తుతం అమలులో లేని శిక్ష కారణంగా రాహుల్ గాంధీ అనర్హుడయ్యారు. అనర్హత వేళ రాష్ట్రపతి ఎన్నికల సంఘంతో సంప్రదించి నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేయాలి. స్పీకర్ గానీ, లోక్‌సభ సెక్రటేరియట్ గానీ పట్టించుకోవడం లేదు. స్పీకర్ లేని అధికారాన్ని వినియోగించుకున్నారు. పార్లమెంటు కార్యకలాపాల్లోకి చొరబడిన ఫాసిస్ట్ వైరస్ లక్షణమిది.

/వ్యాసకర్త పార్లమెంటు మాజీ సభ్యుడు/

జనవాక్యం

న్యాయం కోసం జనం

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు దిగివచ్చి తన ప్రభుత్వం తలపెట్టిన న్యాయ సంస్కరణల్ని తాత్కాలికంగా నిలుపుదల చెయ్యడం అక్కడి ప్రజా ఉద్యమ విజయం. న్యాయ సంస్కరణల పేరుతో ఆయన న్యాయ పాలికను గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నం చేశారు. న్యాయ మూర్తుల నియామకం, కార్యనిర్వాహక వ్యవస్థ పైచేయిగా ఉండేలా మార్పులు, ప్రధానిని అవినీతి కేసుల్లో విచారించే అవకాశం లేకుండా చెయ్యడం లాంటి నిర్ణయాలతో శాసనాన్ని అమలుచేయాలని భావించారు. వీటిపై స్వంత కేబినెట్ లోనే విమర్శలు రాగా, ఒక మంత్రిని ఉద్వాసన పలికారు. అయితే వేలాదిమంది పౌరులు ఉద్యమాన్ని వీధుల్లోకి తీసుకువచ్చి, ఉధృతం చేశారు. కార్మిక సంఘాలు, పౌరులు ఈ ప్రతిపాదనల్ని ప్రభుత్వం విరమించక పోతే ఉద్యమ తీవ్రత పెంచనున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు అంతర్జాతీయ సమాజం నుండి ఉద్యమానికి మద్దతుగా, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఒత్తిడి పెరగసాగింది. ప్రధాని నెతన్యాహు వెనకడుగు వేసి తాత్కాలికంగా న్యాయ సంస్కరణల ప్రయత్నాలను ఆపివేస్తున్నట్లు ప్రకటించారు. ఇలా శాసన వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు నడుమ అధికారంలో పైచేయి కోసం ప్రయత్నాలు పలు దేశాల్లో జరుగుతున్నాయి. మన దేశంలో కూడా ఇంతకూ ముందు కన్నా ఇప్పుడు ఈ రెండు వ్యవస్థల నడుమ దూరం పెరిగింది. ఒకదానిపై ఒకటి విమర్శించుకోవడం సాధారణమై పోయింది. ప్రజాస్వామ్యపు ఆరోగ్యానికి రెండు వ్యవస్థలూ సమానాధికారంతో ఉండడం అవసరం. ఒక దానికి ఇంకొకటి చెక్‌గా ఉండాలి. ప్రజాస్వామ్య విధానాన్ని ఇష్టపడేవారు ఆ బ్యాలెన్స్ తప్పే పరిస్థితులు రానివ్వరాదు.

- డా. డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

టిడిపి ఆవిర్భావ వేడుకల్లో జెపి నడ్డా

ప్రజాశక్తి న్యూఢిల్లీ బ్యూరో

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలకు బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా హాజరయ్యారు. బుధవారం పార్లమెంట్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, కేక్ కట్ చేయడం ద్వారా పార్టీ ఆవిర్భావ వేడుకలను టిడిపి ఎంపిలు గల్లా జయదేవ్, కేశనేని నాని, కనకమేడల లాంఛనంగా ప్రారంభించారు. కేక్ ముక్కలను ఇతర పార్టీల ఎంపిలకు వారు పంచిపెట్టారు. ఈ వేడుకలు జరుగుతున్న సమయంలోనే అక్కడకు జెపి నడ్డా వచ్చి, టిడిపి నేతలను అభినందించారు. వాజ్‌పేయి, ఎన్‌డిఎ హయాంలో టిడిపి-బిజెపిల అనుబంధం గురించి జెపి నడ్డాకు ఎంపి కనకమేడల వివరించబోగా, అది అంతా తనకు తెలుసునని నడ్డా అన్నారు. ఇటీవల అండమాన్ మేయర్ ఎన్నికల్లో టిడిపి-బిజెపి పొత్తుపైన, ఆ రెండు పార్టీల విజయంపైనా నడ్డా ట్విట్టర్‌లో హర్షం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

అదనపు విద్యుత్ మిథ్య

వ్యర్థాలతో విద్యుదుత్పత్తి జాడే లేదు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుదుత్పత్తి మెరుగుపరచాలన్న ప్రభుత్వ ఆశలు నెరవేరడం లేదు. ఏడాది కాలంలో కేవలం 101 మెగావాట్ల విద్యుదుత్పత్తిని మాత్రమే అధికారులు సాధించగలిగారు. అది కూడా ఒక్క సౌర విద్యుత్ నుంచి మాత్రమే కావడం గమనార్హం. మొత్తం ఎనిమిది రంగాల్లో విద్యుదుత్పత్తికి చర్యలు తీసుకుంటుండగా, ఏడు రంగాల్లో ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఈ ఏడాది ఉత్పత్తి చేయలేకపోయారు. 2021-22లో 8,884 మెగావాట్ల ఉత్పత్తి కనిపించగా, ప్రస్తుతం 8,985 యూనిట్లుగా నమోదైంది. సంప్రదాయేతర ఇంధన వనరులశాఖ ద్వారా వాయు, సౌర, చిన్న జలవనరులు, బయోమాస్, బయోమాస్ ఎనర్జీ కో-జనరేషన్, బగస్సీ ద్వారా కో-జనరేషన్, మున్సిపల్ సాలిడ్ వేస్ట్, ఇండస్ట్రియల్ వేస్ట్ రంగాల ద్వారా విద్యుదుత్పత్తి సాధించాలని నిర్ణయించారు. అయితే అమలులో మాత్రం ఇది సాధ్యం కావడం లేదని అధికారులే అంగీకరిస్తున్నారు. సంబంధిత రంగాల విద్యుదుత్పత్తికి ఎవరూ ముందుకు రాకపోవడం, ప్రభుత్వం తరపున కూడా ఆశించిన స్థాయిలో ప్రోత్సాహకాలు లేకపోవడం వల్లనే విద్యుదుత్పత్తి సాధ్యం కావడం లేదన్న వాదన వినిపిస్తోంది.

సౌర విద్యుత్ రంగంలో గతేడాది 4,174 మెగావాట్ల విద్యుదుత్పత్తి రికార్డు కాగా, ఈ ఏడాది 101 మెగావాట్లు అదనంగా ఉత్పత్తి చేశారు. మిగిలిన రంగాల్లో మాత్రం ఒక్క యూనిట్ కూడా అదనంగా ఉత్పత్తి కాకపోవడం విశేషం. వివిధ రంగాల్లో వ్యర్థాల ద్వారా తక్కువ ధరకు విద్యుదుత్పత్తి చేయడంపై చాలాకాలంగా దృష్టి సారిస్తున్నారు. మున్సిపాల్టీల్లో వ్యర్థాల ద్వారా చేసే విద్యుత్‌ను ఆయా మున్సిపాల్టీల్లో ఉపయోగించుకోవడం ద్వారా అక్కడి యంత్రాంగాలు స్వీయ ఆర్థిక స్వావలంబన సాధించవచ్చునని ప్రభుత్వాలు చెబుతూ వస్తున్నాయి. పరిశ్రమల వ్యర్థాల ద్వారా కూడా ఆయా పరిశ్రమలు స్వీయ అభివృద్ధి చేసుకోవచ్చునని పథకాలు రచించారు. ఇక గ్రామాల్లో బయోగ్యాస్, బయోమాస్ ద్వారా చేసే విద్యుదుత్పత్తి కూడా పల్లెలకు మేలు కలుగుతుందని చెబుతున్నారు. ఈ రంగాల్లో ప్రగతి కనిపించకపోవడంతో ఆయా రంగాలు ఇప్పటికీ సాధారణ విద్యుత్‌నే ఉపయోగించుకోవాల్సి వస్తోంది.

పలు కీలక రంగాల్లో విద్యుదుత్పత్తి (మెగా వాట్లలో)

రంగం	2021-22	2022-23	మొత్తం
పవన విద్యుత్	4083	---	4083
సౌర విద్యుత్	4174	101	4275
మినీ హైడ్రో	106	---	106
బయోమాస్	171	---	171
బగస్సీ	207	---	207
మున్సిపల్ వేస్ట్	36	---	36
పరిశ్రమల వేస్ట్	41	---	41

పట్టభద్రులు స్థిరమైన నిర్ణయాలతో ముందుకు సాగాలి

ఐఐఎంవి స్నాతకోత్సవంలో రిషిహుడ్ ఛాన్సలర్ సురేష్ ప్రభు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవి) ఏడో వార్షిక స్నాతకోత్సవం బుధవారం విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో ఘనంగా జరిగింది. మొత్తం 239 మంది విద్యార్థులు పట్టభద్రులయ్యారు. ముఖ్య అతిథిగా హరియాణాలోని రిషిహుడ్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్, కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు స్థిరమైన నిర్ణయాలతో ముందుకు సాగాలన్నారు. సహజ వనరుల నిర్వహణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సవాళ్లను ఎదుర్కోవాలన్నారు. ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎమ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ పిజిపి విద్యార్థులు ప్లేస్‌మెంట్ సీజన్‌లో సగటున రూ.16.6 లక్షల జీతంతో రికార్డు సృష్టించారన్నారు. అనంతరం ఆయన ప్రతిష్టాత్మకమైన ఎంజిఎన్‌ఎఫ్ ప్రోగ్రామ్‌ను వివరించారు. ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న సురేష్ ప్రభు

స్టెమ్, స్మార్ట్ స్కూల్‌తో వినూత్న బోధన

- పాఠశాల విద్య కమిషనరు సురేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్య, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో సేవ్ ది చిల్డ్రన్ సంస్థ పాఠశాల విద్యలో కొత్త ఒరవడి సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమెటిక్స్ (స్టెమ్) డిజిటల్ విధానం ద్వారా నాణ్యమైన విద్య అందుతుందని పాఠశాల విద్యాశాఖ కమిషనరు, సమగ్ర శిక్షా డైరెక్టరు ఎస్ సురేష్ కుమార్ అన్నారు. సమగ్ర శిక్షా కార్యాలయంలో సేవ్‌ది చిల్డ్రన్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, సన్ ఫౌండేషన్, సన్‌టివి నెట్‌వర్క్ సంస్థలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. పిల్లలకు అనుభవాత్మక విద్యను అందించడానికి ప్రత్యేక ప్రాజెక్టులను రూపొందించడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రంలో 81 ఆదర్శ పాఠశాలలు, 117 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో ల్యాబొరేటరీలను చిల్డ్రన్ స్టెమ్, స్మార్ట్ ల్యాబొరేటరీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ వినూత్న కార్యక్రమం పిల్లలకు ఎంతో ఉపయోగమని, దీని ద్వారా సైన్స్, మేథ్స్, ఇంజినీరింగ్, సాంకేతిక రంగాల్లో ప్రగతి సాధించగలరని తెలిపారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్షా ఎఎస్‌పిడి బి శ్రీనివాసరావు, కెజిబివి కార్యదర్శి డి మధుసూదనరావు, ఆదర్శ పాఠశాలల కార్యదర్శి కెవి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఇడి ముందుకు కవిత న్యాయవాది

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎమ్మెల్సీ కవిత న్యాయవాది సోమా భరత్ బుధవారం కూడా ఇడి ముందుకు హాజరయ్యారు. కవిత ఫోన్ల నుంచి ఇడి అధికారులు సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఎమ్మెల్సీ కవితకు ఇడి జాయింట్ డైరెక్టర్ తాజాగా లేఖ రాసిన విషయం విదితమే. తాము కవిత అందించిన మొబైల్ ఫోన్లను తెరిచేందుకు సిద్ధమయ్యామని లేఖలో తెలిపారు. ఫోన్లు ఓపెన్ చేసేటప్పుడు స్వయంగా హాజరుకావడం లేదా తన ప్రతినిధిని పంపాల్సిందిగా లేఖలో పేర్కొన్నారు. కవిత తరపున ఇడి కార్యాలయానికి బిఆర్ఎస్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ వరుసగా రెండో రోజు వెళ్లారు. కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబును ఇడి అధికారులు మరోసారి విచారణకు పిలిచారు. కొన్ని గంటల పాటు బుచ్చిబాబుపై ఇడి ప్రశ్నల వర్షం కురిపించింది.

రష్యా వజ్రాల ఎగుమతులను అడ్డుకునేందుకు పశ్చిమ దేశాల కుటిల యత్నాలు

మాస్కో : రష్యా వజ్రాల ఎగుమతుల్లో జోక్యం చేసుకునేందుకు పశ్చిమ దేశాలు చేసే యత్నాలు మొత్తంగా సరఫరా చెయిన్లలో ఆటంకాలకు దారి తీస్తాయని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకార విభాగాధిపతి దిమిత్రి బిరిచెవ్‌స్కీ తెలిపారు. పైగా ఈ చర్యలు పారిశ్రామిక ప్రయోజనాలకు పూర్తి విరుద్ధమని అన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఆంక్షలతో కూడిన, ప్రతికూల చర్యలతో సరఫరా మార్గాలకు ఆటంకం కలిగే ముప్పు వుందని, ఇది మొత్తంగా వజ్రాల పరిశ్రమ ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. ఇందుకు సంబంధించి, పశ్చిమ దేశాలు తమ బాధ్యతారాహిత్య చర్యలకు ఆమోదయోగ్యమైన ఒక సాకును వెతుక్కునేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. వజ్రాల ఉత్పత్తిలో రష్యాది ప్రముఖ స్థానం, మొత్తంగా ప్రపంచ ఉత్పత్తిలో 30శాతం రష్యాదే. రష్యా తయారీదారులు చాలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని, వారి కార్యకలాపాలు అంతర్జాతీయ ప్రమాణాలను కూడా అధిగమిస్తాయని, ఇతరులకు ఆదర్శప్రాయంగా వుంటారని దిమిత్ర పేర్కొన్నారు.

భారత్‌కు పెరగనున్న రష్యా చమురు విక్రయాలు

ఇరు దేశాల చమురు కంపెనీల మధ్య ఒప్పందం

మాస్కో : భారత్‌కు చమురు విక్రయాలను పెంచుతూ ఒప్పందం చేసుకున్నట్లు రష్యా ఇంధన దిగ్గజ సంస్థ రాస్‌నెఫ్ట్ బుధవారం ప్రకటించారు. ఉక్రెయిన్ ఘర్షణపై పశ్చిమ దేశాలతో ఒప్పందాలు తలెత్తిన నేపథ్యంలో రష్యా కొత్త కొనుగోలుదారులు కోసం అన్వేషిస్తోంది. గత ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌తో సైనిక చర్య చేపట్టాలని రష్యా నిర్ణయించిన నేపథ్యంలో యురోపియన్ మార్కెట్‌లో రష్యా వాటా కుప్పకూలింది. రష్యా చమురు రంగంపై ఉక్రెయిన్ మిత్రపక్షాలు ఆంక్షలు విధించాయి. తమ సిఇఓ ఇగర్ సెషిన్ భారత్‌కు వెళ్ళి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని రాస్‌నెఫ్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌కు చమురు సరఫరాలను గణనీయంగా పెంచడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని ఆ ప్రకటన తెలిపింది. అయితే, ఆ ఒప్పందం విలువను రాస్‌నెఫ్ట్ వెల్లడించలేదు. భారత్‌కు రష్యా చమురు విక్రయాలు గతేడాదితో పోలిస్తే 20రెట్లకు పైగా పెరిగాయని రష్యా డిప్యూటీ ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ ప్రకటించిన మరునాడే ఈ ప్రకటన వెలువడింది. తమ తమ జాతీయ కరెన్సీల్లో చెల్లింపులు జరిపేందుకు గల అవకాశాలపై ఇరు చమురు కంపెనీల ప్రతినిధులు చర్చించారని తెలిపారు.

ఆదాని కుంభకోణంపై విస్తృత ప్రచారం

- ప్రజాసమస్యలపై పోరాటాలు
- సిపిఎం రాష్ట్రనాయకులు దడాల సుబ్బారావు పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులైన ఆదానీ కుంభకోణంపై చర్యలు తీసుకోకపోవడం దారుణమని దీనిపై ప్రజల్లో విస్తత ప్రచారం చేయాలని సిపిఎం రాష్ట్రనాయకులు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని ధ్వజమెత్తారు. దేశంలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీపై చిన్న కేసు విషయంలో రెండు సంవత్సరాలు జైలుశిక్ష పడిందని కుంటిసాకుతో పార్లమెంటుకు అనర్హుడని తొలగించడం సిగ్గుచేటు అన్నారు. దేశంలో ప్రధానంగా ఉన్న 18 పార్టీలు కేంద్రప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్న రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అధికార దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాలపై దాడి చేస్తున్నదని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో అధికారంలో ఉన్న రాష్ట్రాలపై అన్ని రకాలుగా దాడి చేస్తూ ఇబ్బందులు గురిచేస్తుదని, రాజ్యాంగాన్ని విరుద్ధంగా గవర్నర్‌లను ఉపయోగించుకుంటూ రాష్ట్రాలపై పెత్తనం చేయడం ఏమిటని ప్రశ్నించారు.

ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా జరుగుతున్న విస్తత ప్రచారంలో చిత్తూరు జిల్లాలో కూడా విస్తతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై జిల్లాలో ప్రస్తుత ప్రచారం నిర్వహించి పోరాటాలకు సిద్ధమవుతున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రజాసమస్యలపై సిపిఎం పోరాటాలకు సిద్ధమవుతున్నదని ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎండల తీవ్రత పెరిగిందని గ్రామీణ ప్రాంతాల్లో, మున్సిపాలిటీలో తాగునీటి సమస్య రాబోతున్నదని దీనిపై ముందు జాగ్రత్త చర్యలు అధికారులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశానికి జిల్లా నాయకులు కే.సురేంద్రన్ అధ్యక్షత వహించగా ఓబుల్ రాజు, గిరిధర్‌గుప్తా, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో విజయ బావుటా ఎగరేద్దాం

- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు



ప్రజాశక్తి-చిలమత్తూరు (సత్యసాయి జిల్లా)

గడిచిన రెండు ఎన్నికల్లో రెండవ స్థానంలో నిలుస్తూ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన సిపిఎం బాగేపల్లి నియోజకవర్గంలో ఈ సారి విజయ బావుటా ఎగరవేస్తుందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవి రాఘవులు అన్నారు. బాగేపల్లిలో ఉన్న ప్రస్తుత ప్రత్యేక పరిస్థితులు సిపిఎంకి అనుకూలంగా ఉన్నాయని అన్నారు. బుధవారం బాగేపల్లి తాలూకా కేంద్రంలో సిపిఎం ముఖ్య నాయకుల సమావేశంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, కేరళ మాజీ మంత్రి ఎంఎ బేబి, కర్నాటక రాష్ట్ర కార్యదర్శి బసవరాజు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుండి గూళూరు సర్కిల్ వరుకు ర్యాలీ నిర్వహించారు. కర్నాటక ఎన్నికల నోటిపికేషన్ ప్రకటన నేపధ్యంలో ఈ సమావేశం హుషారుగా సాగింది. ఇక్కడ పోటీలో ఉన్న ఇతర పార్టీ అభ్యర్థులు మధ్యం మాఫియా, రియలెస్టేట్ మాఫియా చేస్తుండటంతో మచ్చలేని సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ గెలుపును బాగేపల్లి ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఎదురొడ్డి గెలవలేని పార్టీలు సిపిఎం నాయకత్వాన్ని విచ్చిన్నం చేసేందుకు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డాయి. సిపిఎం నాయకత్వాన్ని ఎవరూ విచ్చిన్నం చేయలేరని అన్నారు. ఒకరిద్దరు తాయిలాలకు కక్కుర్తిపడి వారి సొంత ప్రయోజనాల కోసం వైదొలొగినా..సిద్ధాంతం వంటబట్టని అలాంటి వ్యక్తుల వల్ల పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు.

కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం ఎప్పుడూ ప్రజలలో ఉంటుందని ఆ పునాధులను ధ్వంసం చేసే దమ్ము ఏ రాజకీయ పార్టీకి, వ్యక్తులకు లేదని అన్నారు. అలాంటి స్వార్ధపూరిత వ్యక్తులకు ప్రజలే ఓటు అనే అయుధంతో బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ లను ఓడించడమే సిపిఎం లక్ష్యం అన్నారు. ఆ శక్తి బాగేపల్లి క్షేత్రంలో సిపిఎంకే ఉందన్నారు. కాంగ్రెస్, బిజెపిలను ఓడించడమే జెడిఎస్ లక్ష్యం అయితే తమతో కలిసి రావాలని అన్నారు. సిపిఎం నేత బేబీ మాట్లాడుతూ కేరళ మోడల్ పాలన కావాలని యావత్తు దేశం చూస్తోందన్నారు. అలాంటి పాలనను బాగేపల్లి ప్రజలు గతంతో చూశారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్ధి బాగేపల్లి క్షేత్రంలో ఏమీ అభివృద్ధి చేయలేదని అన్నారు. గతంలో సిపిఎం ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి వల్లే నేడు పార్టీ గెలుపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప, నాయకులు, సావిత్రమ్మ, నాగరాజు, సోముశేఖర్ రెడ్డి యువజన సంఘం నాయకులు రఫీఉల్లా, హరీష్, సురేష్, ఆసిప్, విద్యార్థి సంఘం, మహిళా సంఘం, నాయకులు పాల్గొన్నారు.

- పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం కెజిబివిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఒ శ్రీరంజని ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 7901098513, 89196 35046 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్మికులకు అస్వస్థత

- ముగ్గురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- రేణిగుంట (తిరుపతి)

తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని విమానాశ్రయం సమీపంలో ఉన్న కర్బామ పరిశ్రమంలో గ్యాస్ లీకేజీతో 11 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. అందులో ముగ్గురి కార్మికులు పరిస్థితి విషమంగా మారింది. ఈ పరిశ్రమలో బుధవారం ఉదయం ఒక విభాగంలో ఒక రకమైన గ్యాస్ లీకై అక్కడ పనిచేస్తున్న మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 11 మందికి ఇబ్బంది ఏర్పడగా వీరిని చికిత్స నిమిత్తం బాలాజీ హాస్పిటల్‌కు తరలించారు. బుధవారం సాయంత్రం ఈ 11 మందిలో ముగ్గురి పరిస్థితి విషమించగా వారిని చికిత్స నిమిత్తం అమర హాస్పిటల్ కి తరలించారు. అయితే ఘటన పై అటు పరిశ్రమ యాజమాన్యం.. ఇటు సంబంధిత అధికారులు స్పందించకపోవడం దారుణమని తోటి కార్మికులు వాపోతున్నారు. అస్వస్థతకు గురైన వారిలో విమల, జయంతి, సుప్రియ, రీటా, పుష్ప, శిరీష, భూమిక, శిరీష ఉన్నారు. వెంటనే వీరికి మంచి వైద్యం అందించి వీరిని అన్ని విధాలుగా ఆదుకోవాలని యాజమాన్యాన్ని రేణిగుంట మండల సిఐటియు నాయకులు నర్సింహారెడ్డి, సెల్వరాజ్, ఓ వెంకటరమణ డిమాండ్ చేశారు.

పొట్ట కూటి కోసం..

- పనుల కోసం ఇతర మండలాలకు వలస
- పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణం
- ఉపాధి పనుల కల్పనలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలంలోని ఆయా గ్రామాల నుండి రోజుకు వేల సంఖ్యలో ప్రజలు పొరుగు గ్రామాలకు, ఇతర మండలాలకు పనుల కోసం వలస పోతున్నారు. నంద్యాల మండలంలోని బిల్లాలపురం, చాబోలు, అయ్యలూరు, పెద్ద కొట్టలా, కానాల గ్రామాల నుండి తెల్లవారుజామున ఇంటి, వంట పనులు ముగించుకుని సద్ది కట్టుకొని ప్రమాదమని తెలిసినా పొట్ట కూటికోసం తప్పని సరై ఆటోలో పరిమితికి మించి, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు చేస్తున్నారు. గతంలో బిల్లాలపురం నుండి కూలి పనుల కోసం పరిమితికి మించి కూలీలతో వెళ్తున్న ఆటో బలపనూర్ మెట్ట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీలందరూ తీవ్ర గాయాలపాలయ్యారు. మిట్నాల, పాండు రంగాపురం, భీమవరం, పోలూరు గ్రామాలకు మిరప పండు కోత కోసేందుకు పనికి వెళ్తున్నారు.



ఉపాధి వేతనం సరిపోవడం లేదు

'ఉపాధి పనులకు వెళ్తే రోజుకు రూ. 120 లేదా 150 రూపాయలు మాత్రమే పడుతుంది. ఏ రోజు కూడా 200 రూపాయలు దాటలేదు. అది కూడా మూడు వారాలకు ఒక ఒక్కసారి, నాలుగు వారాలకు ఒకసారి బిల్లులు పడతాయి. అంతవరకు ఇల్లు యెట్లా గడిచేది. అసలే శ్రీరామ నవమి, ఈస్టర్, రంజాన్ పండుగలు ఒకదాని వెంట ఒకటి వస్తుండే. మరి పని చేసుకుంటే తినాలి లేకపోతె ఇబ్బందులు పడాల్సి వస్తుంది.. అందుకే వేరే గ్రామాలకు పనులకు వెళ్తున్నాం. పండు మిరప కోతకు వెళ్తే 300 రూపాయలు ఇస్తారు. అందులో ఆటో చార్జిలు 50 రూపాయలు పోతాయి.. మిగతా 250 రూపాయలు వస్తాయి. ఉపాధి పనులకు తక్కువ వేతనం వస్తుండడం, అదికూడా ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. అందుకే ఇతర గ్రామాలకు కూలికి 250 రూపాయల కోసం ప్రమాదకరమని తెలిసినా వెళ్తున్నాం. పనికి వెళ్తేనే పూట గడిచేది. లేకపోతే పస్తుండాల్సిందే..' అనిఅని మహిళా కూలీలు వాపోతున్నారు.

మస్టర్లలో చేతి వాటం..

కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు వారి కుటుంబ సభ్యులు రాకున్నా తల్లికి, తండ్రికి, చెల్లికి, భార్యకు, వచ్చినోనికి, రానివారికి మస్టర్లు వేసుకుంటారని, దాంతో పనికి వచ్చిన వారు ఎంత పని చేసినా కూలి తక్కువ పడుతుందని కూలీలు చెబుతున్నారు. 'పైన చెకింగ్‌కు వచ్చిన అధికారులేమో పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తారని, కూలి తక్కువ పడుతుందని అడిగితే ఏం చేస్తామమ్మా మీరు పని తక్కువ చేస్తున్నారు.. మీరు కొలతలు సరిగా వేసుకోవడం లేదు.. మీ పనిలో నాణ్యత లేదు' అని సమాధానం చెప్పి వెళ్లి పోతారు తప్పా తప్పు ఎక్కడ జరుగుతుందో తెలుసుకోవడంలేదు.. అలా వస్తారు ఇలా వెళ్లి పోతారు..' అని కూలీలు వాపోతునానరు. అందుకే ప్రమాదమో ప్రయాసానో అనుకుంటే పండగ పూట పిల్లలు పస్తులు ఉండాల్సి వస్తుందని అంటున్నారు.

కూలీల సంఖ్య పెంచడంలో, పనులపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

ఉన్నతాధికారులు ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని చెబుతున్న కింది స్థాయి అధికారులు వాటిని గాలికి వదిలేస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులు కూలీల సంఖ్య ఎందుకు పెరగలేదని అడిగితే క్రింది స్థాయి అధికారులు గ్రామాలలో వ్యవసాయ పనులు జరుగుతున్నాయని, అందుకే ఉపాధి పనులకు ప్రజలు సరిగా రావడం లేదని సమాధానం చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి పనులకు వచ్చేది పది మంది అయితే ఉన్నత అధికారులకు కూలీల సంఖ్య పెరిగిందని చూపడం కోసం కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని గ్రామాలలో ప్రజలు చర్చించుకుకంటున్నారు. ఈ విషయాలు అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు జాబ్ కార్డ్ ఉన్న ప్రజలకు పనులపై అవగాహన కల్పించి, కనీస వేతనం, 250 రూపాయలు వచ్చేలా చేసి, వారం రోజులు చేసిన పనికి వేతనం వచ్చే వారంలోనైనా వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఇతర గ్రామాలకు వలస పోకుండా చూడాలని మహిళా కూలీలు కోరుతున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరురూరల్

మహిళల ఆర్థికాభివృద్ధితోనే కుటుంబం బాగుంటుందని, అదే లక్ష్యంతో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలోని మామిడిపల్లిలో సర్పంచ్ సువ్వడ శశికళ అధ్యక్షతన వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నిధుల చెక్కును లబ్ధిదారులకు బుధవారం ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాలకు రుణ మాఫీ అమలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డికి ఓటు వేయడం ద్వారా రుణం తీర్చుకోవాలని కోరారు. మండలంలో 1073 మహిళా సంఘాలలోని 10,723 మంది మహిళలకు 4.58 కోట్ల రూపాయలను ఆసరా ద్వారా అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, ఎపిఎం గండిపల్లి సింహాచలం, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీనివాస్, కల్లేపల్లి త్రినాథ్, గణేష్ పాల్గొన్నారు.

పోలీసులు స్నేహభావంతో మెలగాలి

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

పోలీసులు స్నేహభావంతో మెలగాలని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో ఎస్పి జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు కాశీబుగ్గ పోలీసులు ఆధ్వర్యాన బుధవారం జిల్లాస్థాయి వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల ఆధ్వర్యాన క్రీడలు పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఉద్దాన ప్రాంతంలోని విప్లవాలకు పురిటి గెడ్డ బొడ్డపాడులో జిల్లాస్థాయి క్రీడలు నిర్వహించడం ఆసక్తికరంగా ఉందన్నారు. బొడ్డపాడులో నిర్వహించిన క్రీడలు రసవత్తరంగా సాగుతాయన్నారు. ఈ క్రీడల వల్ల క్రీడాకారుల్లో ప్రతిభ బయటపడటంతో పాటు వారి మధ్య స్నేహభావం మెరుగుపడుతుందన్నారు. ముందుగా మంత్రి అప్పలరాజుకు కాశీబుగ్గ డిఎస్‌పి దుశ్మాలువ కప్పి సన్మానించారు. ఈ పోటీల్లో వాలీబాల్ పోటీలకు 18, క్రికెట్‌కు ఆరు, బ్యాడ్మింటన్‌కు ఎనిమిది టీములు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావుచిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, సర్పంచ్ తామడ మధన్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో ఎఎఫ్‌యు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకడమి నిర్వహించిన క్వార్టర్లీ ఫొటోగ్రఫీ కాంపిటిషన్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బిఎఫ్ఎ ఫొటోగ్రఫీ రెండవ సంవత్సరం చదువుతున్న ఉమ మహేశ్వరరావు మూడవ బహుమతి, చంద్రకాంత్‌కి కలర్ సెక్షన్ మెరిట్ సర్టిఫికేట్స్ రావడాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బానోత్ ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రర్ ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు. వైస్ ఛాన్సలర్ బానోత్ ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ యూనివర్సిటీకి ఇంకా ఎన్నో అవార్డులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్ ఎంఆర్‌సి సతీష్ పాల్గొన్నారు.

మెరిట్ ఆధారంగా పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో భర్తీ చేయనున్న 20 ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను డెమో, ఇంటర్వ్యూ లేకుండా మార్కుల మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ విషయమై ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు.

ఏలూరు అర్బన్ మండలం ఏర్పాటుకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు జిల్లా కేంద్రంగా ఉన్న ఏలూరు మండలాన్ని ఏలూరు అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు జిఒ ఆర్‌టి నెం.312ను జారీ చేసింది. ఏలూరు అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తున్నట్లు ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకుంది. అయితే ఇటీవల కొన్ని నగరాల్లో మండలాలను విభజిస్తున్నట్లు నోటిఫికేషన్ వచ్చినా దానిలో ఏలూరు లేకపోవడం చర్చనీయాంశమైంది. తాజాగా ఏలూరును అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తూ నోటిఫికేషన్ విడుదల కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఉన్న తహశీల్దారు ఆఫీస్‌ను మరొటి ఏర్పాటు చేస్తారని, పోస్టులు కూడా మంజూరు అవుతాయని తహశీల్దారు సోమశేఖర్ ప్రజాశక్తికి తెలిపారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-గుత్తి (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా సహకార పరపతి సంఘం అధ్యక్షుడు చిట్టెం విజయ భాస్కర్‌రెడ్డి హత్యకేసులో ఇరువురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ బుధవారం గుత్తిలోని 6వ అదనపు న్యాయస్థానం తీర్పునిచ్చింది. వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి చెందిన చిట్టెం విజయభాస్కర్‌రెడ్డి వైసిపిలో కొనసాగేవారు. అంతేగాకుండా పరపతి సహకార సంఘం ఎన్నికల్లో అధ్యక్షునిగా గెలుపొందారు. ఆ విజయాన్ని ఓర్వలేక అదే గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్‌నాయుడు, పి.గురుప్రసాద్, గుర్రం శ్రీనివాసులు ఆలియాస్ బక్క శీనా, గుర్రం సుధాకర్‌నాయుడు, గుర్రం శేషాచలపతినాయుడు అలియాస్ శేషా, గుర్రం రమణ, గుర్రం వెంకటరమణ విజయ భాస్కర్‌రెడ్డిపై కక్ష పెంచుకున్నారు. వారందరూ కలిసి విజయ భాస్కర్‌రెడ్డిని హత్య చేసేందుకు పన్నాగం పన్నారు. 2015 మార్చి 31వ తేదీన పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామంలోని పరపతి సహకార సంఘం కార్యాలయంలో విజయభాస్కర్‌రెడ్డి ఉండగా లోనికి చొరబడిన నిందితులు కర్రలతో అతని తలపై మోదారు. తీవ్రగాయాలతో అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పామిడి సీఐ లక్ష్మన్న కేసును దర్యాప్తు చేశారు. కేసు పూర్వాపలాలు పరిశీలించిన జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి జి.కబర్ది నిందితులైన పి.గురుప్రసాద్, జి.శ్రీనివాసులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష, జి.సుధాకర్ నాయుడు, జి.శేషా ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి చొప్పున జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు జైలు శిక్ష, జి.రమణ, జి.వెంకటరమణకు ఒక్కొక్కరికి జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు. కేసును ఏపీపీ బి.సుదర్శన్‌రెడ్డి వాదించారు.

రూ.1500 కోట్ల భూ ఆక్రమణలు

- జెసికి టిడిపి నాయకుల ఫిర్యాదు
- ప్రత్యేక స్పందన'కు 135 వినతులు
- ఉజ్జిడిమెట్ట రైతులను అడ్డుకున్న పోలీసులు
- ఆక్రమణలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా : మంత్రి సీదిరి



ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం)

పలాస నియోజకవర్గంలో రూ.1500 కోట్ల విలువైన భూముల ఆక్రమణలు జరిగాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, నాయకులు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో భూ సమస్యలు, ఆక్రమణలపై మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వినతులు స్వీకరించారు. ప్రత్యేక స్పందనకు భూ ఆక్రమణలు, వ్యక్తిగత భూ సమస్యలు, కుటుంబ కలహాలు తదితర వాటికి సంబంధించి 135 వినతులు వచ్చాయి. టిడిపి హయాంలో బిసి భవనం కోసం మంజూరైన భూమి అన్యాక్రాంతమైందని, రూ.కోటి పైబడి చేతులు మారినట్లు టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 51-1, 51-2, 51-3లో అనధికార మైనింగ్ చేసి రూ.కోట్ల కంకర కైంకర్యం చేశారని, ఆ స్థలంలో లేఅవ్లు వేశారని తెలిపారు. రామకృష్ణాపురంలో సర్వే నంబరు 143-1లో ఉజ్జిడిమెట్ట సుమారు 30 ఎకరాలు ఆక్రమణకు గురైందని జెసి దృష్టికి తీసుకెళ్లారు. కోసం మున్సిపాలిటీ రెండో వార్డు పరిధిలోని పురుషోత్తపురం సర్వే నంబరు 26లో ఎర్ర కాలువను కబ్జా చేసి నిర్మించిన వాణిజ్య సముదాయాలపై, సర్వే నంబరు 34, 35లో ఎర్ర కాలువను ఎకరా స్థలాన్ని ఆక్రమించుకున్నారని స్థానిక యువకులు ఫిర్యాదు చేశారు. మందసలోని వరాహస్వామి ఆలయ భూమిని ఆక్రమించి దుకాణాలు కట్టారని స్థానికులు జెసి దృష్టికి తీసుకొచ్చారు. మందస బస్టాండ్‌లో సంతోష్ కుమార్ పాణిగ్రాహి అనే వ్యక్తి ఆర్అండ్‌బి స్థలాన్ని ఆక్రమించారని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని బస్టాండ్ కు ఉపయోగించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. బ్రాహ్మణతర్లాలో సర్వే నంబరు 56లో రెండు చెరువులను కప్పేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వీటితోపాటు పలు ఫిర్యాదులు వచ్చాయి. చిన్న చిన్న భూ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదు రావడంతో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల తహశీల్దార్లు ఎల్.మధుసూదనరావు, బి.పాపారావు, బి.అప్పలస్వామిపై జెసి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఉజ్జిడిమెట్ట రైతులను అడ్డుకున్న పోలీసులు

తమ భూములకు 1బి ఇవ్వాలని కోరుతూ మండలంలోని రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలోని ఉజ్జిడిమెట్ట రైతులు వామపక్ష నాయకులతో కలిసి స్పందనలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. రైతులందరూ వినతిపత్రం ఇచ్చేందుకు కుదరదని, నలుగురు మాత్రమే లోపలకు వెళ్లాలని పోలీసులు స్పష్టం చేశారు. గతంలో తాము ఆందోళన చేపట్టినప్పుడు 1బి ఇస్తామని మంత్రి అప్పలరాజు, తహశీల్దార్ హామీనిచ్చి నెలలు గడుస్తున్నా ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. దీనిపై అందరం కలిసే వినతిపత్రం ఇస్తామని చెప్పడంతో పోలీసులు అందుకు అంగీకరించలేదు. దీంతో ఫిర్యాదు చేయకుండానే రైతులు వెనుదిరిగారు.

భూ ఆక్రమణలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా : సీదిరి

పలాస నియోజకవర్గంలో తాను భూ ఆక్రమణలు చేస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారని, తాను ఆక్రములు చేసినట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణలు ఎక్కువగా జరిగాయన్నారు. వాటికి, తనకు ఏమిటి సంబంధమని ప్రశ్నించారు. వైసిపి నాయకులు, తన అనుచరులు ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడినట్లు ఆధారాలతో సహా తన దృష్టికి తీసుకొస్తే వాటిని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌ల్లో సరైన ప్రాతినిధ్యం లేని ఒబిసిలు, ఎస్‌సి, ఎస్‌టిలు

న్యూఢిల్లీ : సివిల్ సర్వీసెస్‌ల్లో ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు సరైన ప్రాతినిధ్యం లేదని పార్లమెంట్‌కు అందచేసిన డేటా పేర్కొంది. రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం ఈ డేటా వెల్లడించింది. జనాభాలో ఒబిసిలు, ఎస్‌సి, ఎస్‌టిలు కలిసి దాదాపుగా సగం వుంటే, సివిల్ సర్వీసెస్‌లో వారి ప్రాతినిధ్యం ఒబిసిలకు 15.92శాతం, ఎస్‌సిలకు 7.65శాతం, ఎస్‌టిలకు 3.80శాతంగా వుందని డేటా పేర్కొంది. ఇంత తక్కువ ప్రాతినిధ్యం వుందంటే కులాల ప్రాతిపదికగా తీవ్రమైన వివక్ష నెలకొందని స్పష్టమవుతోంది. గత ఐదేళ్ళ కాలంలో ఆల్ ఇండియా సర్వీసెస్‌లకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు, ఆయా సర్వీసెస్‌ల్లో నియమితులైన వారి వివరాలను చూస్తే ఈ విషయం అర్ధమవుతోందని ఎంపి పేర్కొన్నారు. సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్, ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌ల్లో మొత్తంగా 2163మందిని నియమించగా, ఐపిఎస్‌లో 1403, ఐఎఫ్ఎస్‌లో 799మంది నియమితులయ్యారని చెప్పారు. వీరిలో ఒబిసిలకు చెందినవారు 695, ఎస్‌టిలకు చెందినవారు 166, ఎస్‌సిలకు చెందినవారు 334మంది వున్నారని తెలిపారు.

మూడేళ్ళలో సైన్యానికి సొంత ఉపగ్రహం

- ఇస్రోతో రక్షణ శాఖ ఒప్పందం

న్యూఢిల్లీ : సైనికావసరాలకై అధునాతనమైన కమ్యూనికేషన్ ఉపగ్రహం జిశాట్ 7బి కోసం ఇస్రో వాణిజ్య సంస్థ అయిన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్)తో కుదుర్చుకున్న ఒప్పందంపై బుధవారం రక్షణ మంత్రిత్వ శాఖ సంతకాలు చేసింది. రూ.3వేల కోట్ల విలువైన ఈ ఒప్పందం భారత సైన్యం కమ్యూనికేషన్ సామర్ధ్యాలను పెంపొందిస్తుంది. భారత నావికాదళం, వైమానిక దళం మాదిరిగా సైన్యానికి ఇంతవరకు ప్రత్యేకంగా ఉపగ్రహం లేదు. సుదీర్ఘకాలంగా వున్న ఈ అవస రాన్ని భర్తీ చేసేలా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సైనిక బలగాలకు, దళాలకు, ఆయుధ స్థావరాలకు, విమానాల్లోని సిబ్బందికి సాధారణ కమ్యూనికేషన్ సంబంధాలను మించి కీలకమైన సమాచార సంపత్తిని, సామర్థ్యాన్ని ఈ ఉపగ్రహం పెంపొందిస్తుందని భావిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. భూ స్థిర కక్ష్యలో పరిభ్రమించే ఐదు టన్నుల ఉపగ్రహాన్ని ఇస్రో దేశీయంగానే అభివృద్ధిపరిచింది. 2026లో సైన్యానికి ఈ ఉపగ్రహం అందే అవకాశాలు వున్నాయని అధికారులు తెలిపారు. కేవలం భూమిపై మోహరించిన సైనిక బలగాల కమ్యూనికేషన్ అవసరాలు మాత్రమే కాకుండా మారుమూల ప్రాంతాల్లోని విమానాల పైలట్లకు, వైమానిక రక్షణ ఆయుధాలకు, ఇతర కీలకమైన మిషన్లకు వ్యూహాత్మకమైన కమ్యూనికేషన్ అవసరాలను ఈ ఉపగ్రహం తీరుస్తుందని అధికారులు తెలిపారు. సైన్యానికి చేరవేసే సమాచారం మరింత సురక్షితంగా వుండేందుకు, ఎక్కడా ఎలాంటి జామ్ లేకుండా వుండేందుకు ఈ ఉపగ్రహం వెసులుబాటు కల్పిస్తుందని సెంటర్ ఫర్ ఎయిర్ పవర్ స్టడీస్ డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్ అనీల్ చోప్రా తెలిపారు.

ఇజ్రాయిల్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

జెరూసలేం : ఇజ్రాయిల్‌లో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతునే వున్నాయి. న్యాయ వ్యవస్థను సంస్కరించాలనే పేరుతో ప్రధాని బెంజామిన్ నెతన్యాహు అమలు చేయతలపెట్టిన వివాదాస్పద ప్రణాళికపై ప్రజలు, రాజకీయ పార్టీలు భగ్గుమంటున్నాయి. ఈ విషయంలో నెతన్యాహు రాజీ పడే సూచనలు కనిపించకపోగా, ఈ వివాదాస్పద ప్రణాళికపై చర్చలకు బృందాలను ఏర్పాటు చేయడాన్ని చేపట్టడంతో ఉద్రిక్తతలు రాజుకున్నాయి. గత మూడు మాసాలుగా కొనసాగుతున్న నిరసనలు, ప్రదర్శనలు ఈ వారంలో మరింత ఉధృతమయ్యాయి. ఇజ్రాయిల్ ప్రధాన కార్మిక సంఘమైన హిస్ట్రాడ్రాట్ సార్వత్రిక సమ్మెకు పిలుపిచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం నెతన్యాహు ప్రసంగిస్తూ, తన ప్రతిపాదనల వల్ల విభేదాలు తలెత్తాయన్న విషయాన్ని అంగీకరించారు. ఈ సంస్కరణలపై బిల్లును ఒక నెల ఆలస్యంగా తీసుకువస్తామని ప్రకటించారు. అంతర్యుద్ధాన్ని నివారించాలని తాను కోరుకుంటున్నానని చెప్పారు. తన రాజకీయ ప్రత్యర్థులతో రాజీ పడాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి చర్చలకు విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. జెరూసలేంలో పార్లమెంట్ భవనం వెలుపల వేలాదిమందితో ప్రదర్శన జరిగిన అనంతరం నెతన్యాహు ప్రసంగించారు. ఏప్రిల్ 30 నుండి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. ఆ సమావేశాల్లో విస్తృత ఏకాభిప్రాయానికి వస్తామని ప్రకటించారు.

ఒకటి నుంచి టోల్ ఛార్జీల పెంపు

రూ.250 కోట్ల ఛార్జీల భారం
ఈ నెల 31న ఆందోళనలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రవాణా రంగంలో ఇప్పటికే భరించలేనంతగా ఉన్న టోల్ ఛార్జీలపై మరో పదిశాతాన్ని పెంచిన నిర్ణయం ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానుంది. పెరుగుతున్న పెట్రో ధరలు, వాహనాల నిర్వహణ ఖర్చులకు అనుగుణంగా వాహనదారులకు బాడుగలు లేకున్నా ప్రతిఏటా 10 శాతం టోల్ ఛార్జీలను పెంచాలని కేంద్రం ప్రకటించడం, దాన్ని తూచా తప్పకుండా అమలు చేయడం పట్ల లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల రవాణా రంగ వాహనాలపై ఈ పెంపుదల తీవ్ర ప్రభావం చూపనుంది. రాష్ట్ర వాప్తంగా 8,650 కిలోమీటర్ల జాతీయ రహదారులపై 58 టోల్‌గేట్లు ఉన్నాయి. సగటున ప్రతివాహనానికి కిలోమీటరుకు రూ.2.19 చొప్పున టోల్‌ఫీజ్ వసూలు చేస్తున్నారు. సగటున ఒక్కో ట్రక్కు లేదా బస్సు నుంచి నెలవారీ ఛార్జీని రూ.10 వేలకు పైగా వసూలు చేస్తుంటే, భారీ లారీలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ చెల్లించాల్సి వస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని టోల్‌గేట్ల నుంచి ఏటా దాదాపు రూ.2,500 కోట్లను టోల్ ఛార్జీస్ పేరుతో రవాణా వాహనాలు చెల్లిస్తున్నాయి. ఇపుడు 10 శాతం పెంపుదలంటే మరో రూ.250 కోట్ల భారం అదనంగా రవాణా వాహన యజమానులపై పడనుంది. ఇప్పటికే డీజిల్, పెట్రోల్ భారాలతోపాటు నిర్వహణ భారాలు పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న రాష్ట్ర రవాణా రంగంపై కేంద్రం ఇలా విధాన నిర్ణయంగా టోల్ ఛార్జీలను వసూలు చేయడాన్ని వాహన యజమానులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలపై ప్రయాణం సాధారణ ప్రజలకు కూడా మరింత భారం కానుంది. 10 శాతం అదనంగా టోల్ ఛార్జీలను పెంచాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

టోల్ ట్యాక్స్ పెంచడం సరికాదు

వైవి ఈశ్వరరావు, ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేషనల్ లాజిస్టిక్ పాలసీలో ఇప్పుడున్న 15 శాతం రవాణా ఖర్చును 9 శాతం తగ్గిస్తామని చెప్పి, రవాణా ఖర్చులు పెరిగేలా టోల్ ఛార్జీలను పెంచడం సరైంది కాదు. ఇప్పటికే పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే పెట్రోల్, డీజిల్ ధరలను ఎక్కువగా భరిస్తున్న వాహన యజమానులపై మరింత భారం మోపేలా టోల్ ఛార్జీలు పెంచడం తగదు. టోల్ ఛార్జీలను పెంచాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

31న నిరసనలను జయప్రదం చేయాలి

ఎం అయ్యప్పరెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్

పెంచనున్న టోల్ ఛార్జీలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు వాహన యజమానులుగా ఈ నెల 31న మధ్యాహ్నం 12 నుంచి 12:10 వరకు పది నిమిషాలపాటు ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపేసి చక్కాజామ్ నిరసనను జయప్రదం చేయాలి. టోల్ ఛార్జీలతోపాటు డీజిల్ ధరలను తగ్గించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వాహన యజమానులతోపాటు ఆర్‌టిసి ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలి.

బిసి కులగణన ఎందుకు చేయరు?

- జంతర్ మంతర్‌లో "జనగణన దీక్ష"
- కాంగ్రెస్, బిఆర్ఎస్, టిడిపి ఎంపిలు సంఘీభావం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిసిల ఓట్లతో గెలుపొంది, బిసి కులగణన ఎందుకు చేయరని బిసి సంక్షేమ సంఘం నేతలు ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బిసి ఓట్లతో గెలిచి, బిసిలకు మోసం చేస్తుందని విమర్శించారు. బుధవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద జాతీయ జన గణనలో బిసి కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బిసి సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బిసి "జనగణ దీక్ష" ను చేపట్టారు. ఈ దీక్షకు కాంగ్రెస్ ఎంపి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బిఆర్ఎస్ ఎంపి బిబి పాటిల్, టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో బిజెపి ప్రభుత్వం బిసిలకు ఒక్క మంచి పని చేయలేదని, పైగా బిసి వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. పార్లమెంట్ కాంగ్రెస్, టిడిపి, బిఆర్ఎస్, వైసిపి పార్టీలో సహా 25 పార్టీలు బిసి కుల గణనకు మద్దతు తెలిపాయని, బిజెపి ఒక్కటే బిసి కుల గణనకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్న మద్దతు ఇచ్చిన బిజెపి, అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చుతోందని దుయ్యబట్టారు. బిసి కుల గణన చేయకపోతే, 2024 ఎన్నికలే బిజెపికి చివరి ఎన్నికలు అవుతాయని హెచ్చరించారు. ఈ దీక్షలోఆంధ్రపదేశ్, తెలంగాణ అధ్యక్షులు కేశన శంకర్రావు, కుల్కచర్ల శ్రీనివాసు, కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, మహిళా సంఘం అధ్యక్షురాలు బి. మని మంజరి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ తరహా.. ప్లాంట్ డాక్టర్

- 15 నుంచి రబీ సీజన్ ధాన్యం సేకరణ
- సమీక్షలో సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫ్యామిలీ డాక్టర్ తరహాలోనే ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయశాఖ అధికారులను సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. భూ పరీక్షల కోసం నమూనాల సేకరణ, వాటిపై పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను రైతులకు అందించడం, వాటి ఆధారంగా పాటించాల్సిన సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించడం చేయాలన్నారు. ఆయా అంశాలపై సమర్ధవంతమైన ఎస్ఒపి రూపొందించాలని అధికారులకు సిఎం సూచించారు. రబీ సన్నాహకాలపై క్యాంపు కార్యాలయంలో బుధవారం వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతిఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పరీక్షలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సిఎం పేర్కొన్నారు. జూన్‌లో ఖరీఫ్ నాటికి పరీక్షల ఫలితాలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వాటి ఆధారంగా రైతుకు సాగులో పాటించాల్సిన పద్ధతులపై పూర్తి వివరాలు, అవగాహన కల్పించాలని సూచించారు. పంటలకు అవసరమైన స్థాయిలోనే ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 15 నుంచి రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణకు అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని సిఎం సూచించారు. అకాల వర్షాల వల్ల పంట నష్టంపై ఎన్యుమరేషన్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. యాంత్రీకరణ పెరిగేందుకు వ్యవసాయ పరికరాల పంపిణీ దోహదపడుతుందన్నారు. ఆర్‌బికెల్లో కియోస్క్‌ల సేవలు పూర్తి స్థాయిలో రైతులకు అందించాలని, ఈ అంశంపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేయాలన్నారు. ఉద్యానవన పంటల మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కొత్త తరహా ఉత్పత్తులు వస్తున్న కొద్దీ మార్కెటింగ్ ఉధృతంగా ఉండాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారులు తిరుపాల్‌రెడ్డి, ఉద్యానవనశాఖ సలహాదారు శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలతో అట్టుడుకుతున్న ఫ్రాన్స్!

- పెన్షన్ సంస్కరణలపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం
- దిక్కుతోచని స్థితిలో మాక్రాన్

పారిస్ : పెన్షన్ సంస్కరణలపై ఫ్రాన్స్ అంతటా వరుసగా పదకొండవ రోజున నిరసనలు హోరెత్తాయి.. పదవీ విరమణ వయస్సును 62 నుండి 64కి పెంచుతూ అధ్యక్షుడు మాక్రాన్ ఏకపక్షంగా అమలు చేయబూనుకున్న పింఛను సంస్కరణలను 85 శాతానికిపైగా ఫ్రెంచి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అప్రతిష్టాకరమైన ఈ సంస్కరణలను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి. మంగళవారం నాలుగు లక్షలమంది నిరసనల్లో పాల్గొనగా, బుధవారం నాటికొచ్చేసరికి రెట్టింపు సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చారు. మాక్రాన్ ప్రభుత్వం నిర్బంధాన్ని ఎంతగా ప్రయోగించినా లెక్క చేయకుండా జనం పెద్దయెత్తున కదులుతున్నారు. దీంతో కొన్ని చోట్ల ప్రదర్శకులకు, పోలీసుల మధ్య హింసాత్మక ఘర్షణలు చెలరేగాయి. పార్లమెంటు సభ్యుల ఓటింగ్‌తో నిమిత్తం లేకుండా సంస్కరణలను దూకుడుగా తీసుకురావడానికి అధ్యక్షుడు మాక్రాన్ ఈ నెల ప్రారంభంలో తన ప్రత్యేక రాజ్యాంగాధికారాన్ని ఉపయోగించారు. ఈ నిరంకుశ చర్యపై ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. పారిశుధ్య కార్మికులు కూడా సమ్మెలోకి దిగడంతో పారిస్ వీధుల్లో టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోయింది. రైల్వే ట్రాకులన్నీ ఆందోళన జరుపుతున్న కార్మికులతో కిక్కిరిసిపోయాయి. విధులను బహిష్కరించి, వీధుల్లోకి రావాలనికార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. పారిస్, ఇతర ప్రధాన నగరాల్లో జరుగుతున్న ఆందోళనలపై ప్రధానంగా అందరూ దృష్టి కేంద్రీకరిస్తున్నా, దేశవ్యాప్తంగా చిన్న పట్టణాలు, నగరాల్లో ప్రజల ప్రాతినిధ్యం కూడా చాలా ఎక్కువగానే వుంది. లోయిరే రీజియన్‌లోని మోంటార్గిస్‌లో దాదాపు 2వేల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ నిరసన తెలియచేశారు. మొత్తం జనాభాలో ఐదవ వంతు మంది రోడ్లపైనే వున్నారు. తనకు గుర్తున్నంతవరకు ఇదే అతిపెద్ద నిరసన ప్రదర్శన అని పాట్రిక్ అనే ఆందోళనకారుడు వ్యాఖ్యానించారు.

చర్చలు జరుపుతాం

వచ్చే మూడు వారాల్లో పార్లమెంట్ సభ్యులతోను, కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరుపుతామని ప్రధాని ఎలిజబెత్ బార్నె ప్రతిపాదించారు. దీనిపై సిజిటి ప్రధాన కార్యదర్శి ఫిలిప్ మార్టినెజ్ స్పందిస్తూ, సంక్షోభాన్ని పరిష్కరించడానికి ముందుగా సంస్కరణలను రద్దు చేసి, ఆ తర్వాత మధ్యవర్తిని నియమించాలని అన్నారు. ఫ్రెంచ్ పింఛను సంస్కరణల అమలుకు జారీ చేసిన ఉత్తర్వులను పక్కన పెడితేనే చర్చలకు అంగీకరిస్తామని యూనియన్లు తేల్చి చెప్పాయి. కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఫాబియెన్ రౌజెల్ మాట్లాడుతూ, కార్మిక సంఘాలతో చర్చలకు తలుపులు తెరిచే వున్నాయని వ్యాఖ్యానించారు. ఈ సంస్కరణలను నిలుపుచేసి, సంక్షోభం నుండి బయటపడేందుకు ఒక మార్గాన్ని కనుగొనేందుకు కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని ఆయన అధ్యక్షుడు మాక్రాన్‌ను కోరారు.

"కర్రలతో ఫ్రాన్స్‌ను పాలించలేరు. ఇదంతా పిచ్చితనం" అని సెనెటర్, వామపక్ష సంస్థ అన్‌సబ్మిస్సివ్ ఫ్రాన్స్ నేత అయిన జేన్ లక్ మెలెంకన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌ను, ఫ్రెంచి ప్రజలను దెబ్బతీయాలని మాక్రాన్ చూస్తున్నారని, కానీ, మేం ఆయనకు దీటైన జవాబిస్తామని ఆయన అన్నారు.

వాయనాడ్‌పై వేచి చూస్తాం : ఇసి

న్యూఢిల్లీ : వాయనాడ్ లోక్‌సభ స్థానం ఎన్నిక విషయంలో తామేమీ తొందరపడడం లేదని భారత ఎన్నికల కమిషన్ చీఫ్ (సిఇసి) రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఏర్పడిన ఖాళీ స్థానాలకు సంబంధించిన షెడ్యూల్‌ను మాత్రమే బుధవారం విడుదల చేసినట్లు రాజీవ్ కుమార్ తెలిపారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడంతో ఈ స్థానం ఖాళీ అయిన సంగతి తెలిసిందే.. కోర్టులో అప్పీల్ చేసుకోవడానికి రాహుల్‌గాంధీకి 30 రోజుల సమయం ఇచ్చారని అన్నారు. బుధవారం కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలతో పాటు మధ్యప్రదేశ్‌లోని జలంధర్ లోక్ సభ స్థానం, జార్సుగుడా (ఒడిషా), సౌర్, చన్‌బె (ఉత్తరప్రదేశ్), సోహింగ్ (మేఘాలయ) అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది.

అమెరికాలో తైవాన్ అధ్యక్షురాలి పర్యటన

- హెచ్చరించిన చైనా

తైపే : తైవాన్ అధ్యక్షురాలు త్సాయి ఇంగ్ వెన్ ఈ వారంలో అమెరికాలో పర్యటించనున్నారు. చైనా నుండి తీవ్ర హెచ్చరికలు ఎదురైనప్పటికీ ఈ పర్యటన సాగుతోంది. కాగా, న్యూయార్క్, కాలిఫోర్నియాల్లో పర్యటన సందర్భంగా అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ కెవిన్ మెక్‌కార్తెతో ఆమె భేటీ అవుతారని భావిస్తున్నారు. మొత్తంగా పది రోజుల పర్యటనలో భాగంగా బుధవారం అమెరికా బయలుదేరిన త్సాయి, గ్వాటెమాలా, బెలిజెల్లో కూడా పర్యటిస్తారని అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. స్పీకర్ కెవిన్‌తో భేటీ అయ్యే విషయాన్ని త్సాయి ధృవీకరించనప్పటికీ, కాలిఫోర్నియా పర్యటన సందర్భంగా ఈ భేటీ వుంటుందని తైవాన్ అధికారులు తెలిపారు. చైనా నుండి ఎదురయ్యే తీవ్ర ప్రతిస్పందనను నివారించేందుకు గానూ ఈ సమావేశం గురించి ప్రచారం చేయడానికి ఉభయ పక్షాలు విముఖంగానే వున్నాయి. కాగా తైవాన్ వ్యవహారాల కార్యాలయ ప్రతినిధి ఝూ ఫెంగ్లియన్ బుధవారం దీనిపై స్పందిస్తూ, తైవాన్ అధ్యక్షురాలి పర్యటనను తీవ్రంగా ఖండించారు. కేవలం హెూటల్‌లో బస చేయడమే కాదు, అమెరికన్ అధికారులతో సమావేశం కూడా అవుతున్నారని అన్నారు. ఒకవేళ అనుకున్నట్లుగానే ఈ సమావేశం జరిగితే, కచ్చితంగా అది మరో కవ్వింపు చర్య కాగలదని అన్నారు. ఇది ఒకే చైనా అన్న సూత్రాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. చైనా సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భంగం కలిగిస్తోందన్నారు. తైవాన్ జలసంధిలో శాంతి, సుస్థిరతలను దెబ్బతీస్తోందన్నారు. ఈ పర్యటనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, కచ్చితంగా దీనిపై పోరాడుతామని చెప్పారు. అయితే ఎలాంటి చర్యలు తీసుకోబోయేది వివరించలేదు.

పరీక్షలప్పుడు ఎంఆర్‌ఒ ఆఫీసుల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేస్తున్నాయి. ఉపాధ్యాయులను ముద్దాయిలుగా చిత్రీకరించడం సరికాదని యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు సహకరించారని ఉపాధ్యా యులపై గతంలోనే చర్యలు తీసుకున్నారని తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో డ్యూటీ ఇన్విజిలేటర్స్ సెల్‌ఫోన్స్ తీసుకురాకుండా నిబంధనలు అమలు చేయాలని కోరారు. అవసరమైతే పొరపాటు చేసిన ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ డ్యూటీ వేయకుండా ఉండాలని తెలిపారు. ఈ విధమైన చర్యలతో ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీయవద్దని కోరారు. ఉత్తర్వులు రద్దు చేయకపోతే పదో తరగతి పరీక్షలను మూకుమ్మడిగా బహిష్కరించాల్సి వస్తుందని ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయి శ్రీనివాస్, హెచ్ తిమ్మన్న హెచ్చరించారు. ఉపాధ్యా యులు బైండోవర్ ఖైదీలా, హత్యకేసు ముద్దాయిలా అని ప్రశ్నించారు. మాస్ కాపీయింగ్ సంబంధం ఉన్న వారిపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ నిర్ణయం సరికాదని, అలా కాకుండా వారికి పరీక్ష విధు లకు మాత్రమే మినహాయింపు ఇవ్వాలని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం తగదని, ప్రతిఏటా శిక్షలు వేస్తామంటే చూస్తూ ఉరుకోబోమని టిఎన్‌యుఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉపాధ్యాయుల గౌరవ మర్యాదలకు భంగం కలిగేలా, దోషులుగా సమాజం ముందు నిలబెట్టే ఉత్తర్వులను దారుణమని డిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నరహరి, ఎన్‌వి రమణయ్య తెలిపారు.

సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడకు వచ్చిందని విమర్శించారు. వైసిపి పాలనపై తిరుగుబాటు మొదలైందని, గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల్లో విద్యావంతులు టిడిపిని గెలిపించడమే ఇందుకు నిదర్శమని తెలిపారు.

పేదల సంపద 30 రెట్లు పెంచుతాం : చంద్రబాబు

సంపద కొంతమందికే పరిమితమవడం ఆర్థిక అసమానతలకు దారితీస్తోందని తెలిపారు. సంపద సృష్టించి ప్రజలకు అందిస్తామని, పేదల సంపద 30 రెట్లు పెంచుతామని అన్నారు. అంతకుముందు ఎపి టిడిపి అధ్యక్షులు అచ్చెన్నాయుడు, తెలంగాణ టిడిపి అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, టిడిపి నేత బాలకృష్ణ, ఆ పార్టీ ఎంపిలు, పలువురు ముఖ్య నేతలు మాట్లాడారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళగిరిలోని ఆ పార్టీ కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కార్యాలయ రిసెప్షన్ కమిటీ సభ్యులు హాజీ షేక్ హసన్ బాషా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ.. ఎన్‌టిఆర్ చేతుల మీదుగా ఆవిర్భవించిన టిడిపిది ఘనమైన చరిత్ర అని అన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే విజయ బావుటాను ఎగురవేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బి వెంకటేశ్వరరావు, మహిళా నాయకులు సత్యవాణి రెడ్డి, ఎన్ఆర్ఐ విభాగం రాజశేఖర్, నాయకులు వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ప్రత్యేక హోదా స్థానంలోనే ప్రత్యేక ప్యాకేజి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలు, జనరల్ కేటగిరీ రాష్ట్రాల మధ్య 14వ ఆర్థిక సంఘం ఎలాంటి వ్యత్యాసాన్ని చూపలేదని, అందుకే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజిని ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రాష్ట్రాలతో కేంద్రం పంచుకునే పన్నుల రాబడి సమాంతరంగా జరగాలన్న ఆర్థిక సంఘం సిఫార్సు మేరకే గతంలో పన్నుల పంపిణీలో 32 శాతం ఉన్న రాష్ట్రాల వాటాను 2015-2020 కాలానికి 42 శాతానికి పెంచినట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం సైతం 2020-2026 కాలానికి ఈ పంపిణీ నిష్పత్తిలో పెద్దగా మార్పులు చేయలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో 90:10 నిష్పత్తిలో కేంద్రం, రాష్ట్రం భరించడం ఆంధ్రప్రదేశ్‌కు మంజూరు చేసిన ప్రత్యేక ఆర్థిక ప్యాకేజిలో ఒక అంశమని తెలిపారు. 2015-16 నుంచి 2019-20 మధ్య కాలంలో విదేశీ ఆర్థిక సంస్థల రుణ సహాయంతో చేపట్టే ప్రాజెక్టల వ్యయాన్ని వడ్డీతో సహా కేంద్రమే చెల్లించడం ప్యాకేజీలో ప్రధాన అంశమని అన్నారు. .

రోహిణి కమిషన్ గడువు పొడిగింపు

వెనుకబడిన కులాల (ఒబిసి) వర్గీకరణ కోసం నియమించిన రోహిణి కమిషన్ కాలపరిమితిని ఈ ఏడాది జూలై 31 వరకు పొడిగించినట్లు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ వెల్లడించారు. వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కోవిడ్ మహమ్మారి ప్రభావంతో దేశవ్యాప్త ఆంక్షల కారణంగా కమిషన్ నిర్ణీత గడువులోగా పని పూర్తి చేయలేకపోవడంతో ప్రభుత్వం కాలపరిమితిని పొడిగించిందని మంత్రి తెలిపారు. కమిషన్ పదవీకాలం ఇప్పటి వరకు 14సార్లు పొడిగించినట్లు మంత్రి తెలిపారు..

కడపలో పిఎం మిత్ర పార్క్‌కు ఆమోదం తెలపలేదు

కడప జిల్లాలో పిఎం మిత్ర పార్క్ ఏర్పాటుకు ఆమోదం తెలపలేదని కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి దర్శన జర్గోస్ తెలిపారు. వైసిపి ఎంపి సంజీవ్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. పార్క్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలు పంపిందని ఆమె పేర్కొన్నారు. మొత్తంగా 13 రాష్ట్రాల నుంచి 18 ప్రతిపాదనలు ఏడు పార్క్ ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

డిఎంఎఫ్ కింద ఎపి నుంచి రూ.1,724 కోట్లు వసూలు

జిల్లా ఖనిజ నిధి (డిఎంఎఫ్) కింద ఆంధ్రప్రదేశ్ నుంచి రూ. 1,724 కోట్లు వసూలు చేసినట్లు కేంద్ర ఖనిజ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. నరసరావు పేట, మచిలీపట్నం ఎంపిలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వసూలు చేసిన మొత్తంలో రూ. 495.05 కోట్లు ప్రధానమంత్రి ఖనిజ్ క్షేత్ర కల్యాణ్ యోజన కింద వివిధ పనులకు వ్యయం చేశామని, మరో రూ. 1,228.95 కోట్లను వివిధ పనులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

కేంద్ర శాఖల్లో 9,79,327 పోస్టులు ఖాళీ

- అత్యధికంగా రైల్వేలో 2,93,943 ఖాళీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో 2021 మార్చి 1 నాటికి 9,79,327 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో బిఆర్ఎస్ ఎంపి నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. అత్యధికంగా రైల్వేలో 2,93,943 పోస్టులు ఖాళీగా ఉండగా, రక్షణ శాఖలో 2,84,706 పోస్టులు, కేంద్ర హెూం శాఖలో 1,43,538 ఖాళీలున్నాయని మంత్రి పేర్కొన్నారు.

లోక్‌సభలో అటవీ సంరక్షణ సవరణ బిల్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో బుధవారం అటవీ సంరక్షణ సవరణ బిల్లు-2023ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రాహుల్ గాంధీ అనర్హత వేటును వ్యతిరేకిస్తూ, అదానీ వ్యవహారంపై జెపిసి వేయాలని డిమాండ్లతో ప్రతిపక్షాల ఆందోళన బుధవారం కూడా కొనసాగింది. నల్ల దుస్తుల ధరించి ప్రతిపక్ష నేతలు మోడీ ప్రభుత్వానికి నినాదాల హెూరెత్తించారు. దీంతో ఉభయ సభల వాయిదాల పర్వం తొక్కాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేయడంతో నిమిషాల్లోనే సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అటవీ సంరక్షణ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కాంపిటేషన్ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ముజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు. జాయింట్ కమిటీ నివేదించిన జీవవైవిధ్య (సవరణ) బిల్లును కూడా ముజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో ప్రతిపక్షాల ఆందోళనతో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో సభ ప్రారంభమైన వెంటనే మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో అదే పరిస్థితి నెలకొంది. వెంటనే సభను సోమవారానికి వాయిదా వేశారు.

మోదానీ సర్కార్‌ను సాగనంపాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

లేదని, పార్లమెంటులో చర్చకు కేంద్రం అంగీకరించడం తెలిపారు.

సమాజంలో అంతరాలు పోవాలంటే విధానాలు మారాలి

కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని, ఒక శాతం సంపన్నుల వద్ద 40 శాతం సంపద కేంద్రీకృతమై ఉందని ప్రకాశ్ కరత్ తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం మోడీ ప్రభుత్వం పనిచేయడం లేదన్నారు. ఉద్యోగాలు కల్పించడం లేదని, కార్మికులకు కనీస వేతనాలివ్వడం లేదని, పేదలకు విద్య, వైద్యం కల్పించడం లేదని తెలిపారు. కానీ, కార్పొరేట్లకు అనేక రాయితీలు కల్పిస్తోందన్నారు. అమెరికా సహా అనేక అభివృద్ధి చెందిన దేశాలు సంపన్నులపై పన్నులు విధిస్తున్నాయని గుర్తు చేశారు. కానీ, మన దేశంలోని కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్యులపై భారాలు మోపుతోందని తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి నిధుల కేటాయింపులో 33 శాతం కోత విధించడం శోచనీయమన్నారు. సమాజంలో అంతరాలు తొలగిపోవాలంటే విధానాలు మారాలని తెలిపారు.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలపై దాడులు

బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలు ముఖ్యంగా ముస్లిములపై దాడులు జరుగుతున్నాయని, ఆయా రాష్ట్రాల్లో వారు రెండో తరగతి పౌరులుగా జీవిస్తున్నారని ప్రకాశ్ కరత్ ఆందోళన వ్యక్తం చేశారు. లవ్ జీహాద్ పేరుతోనూ, బీఫ్ విక్రయిస్తున్నారనే పేరుతోనూ, గోరక్షణ పేరుతోనూ దాడులు జరుగుతున్నాయని వివరించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ హిందూత్వ ఎజెండా పేరుతో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయన్నారు.

ప్రతిపక్ష ముక్త భారత్‌లో భాగమే రాహుల్‌పై అనర్హత వేటు

ప్రతిపక్ష ముక్త భారత్‌ను మోడీ కోరుకుంటున్నారని, అందులో భాగంగానే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని ప్రకాశ్ కరత్ దుయ్యబట్టారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని ఇడి, సిబిఐ దాడులు చేయిస్తూ కేసులు బనాయిన్నారని అన్నారు. ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, బిఆర్ఎస్ నేత కవితలను విచారిస్తున్నారని, ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాను అరెస్టు చేశారని వివరించారు. ప్రతిపక్షాల్లోనే అవినీతిపరులున్నారని, బిజెపిలో నీతిపరులున్నారని ఆ పార్టీ భావిస్తోందని విమర్శించారు. అవినీతిపరులంతా బిజెపిలో చేరితే నీతిమంతులుగా మారిపోతారా?అని ప్రశ్నించారు. అసోం ముఖ్యమంత్రి హేమంత విశ్వశర్మ కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు సిబిఐ కేసు పెట్టిందని, బిజెపిలో చేరాక ఆ కేసుల్లేవని గుర్తు చేశారు. మోడీకి రాజ్యాంగమంటే గౌరవం లేదని, ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. న్యాయవ్యవస్థను కూడా కేంద్రం తన చెప్పు చేతల్లో ఉండేలా కుట్రలు చేస్తోందని విమర్శించారు.

బిజెపి మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలపై రాజీలేని పోరాటం

బిజెపి మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని ప్రకాశ్ కరత్ తెలిపారు. భవిష్యత్తులో ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలన్నారు. తెలంగాణపై బిజెపి కన్నేసిందని తెలిపారు. ప్రలోభాలు, డబ్బు, పదవులను ఆశ చూపి ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావాలని భావిస్తోందని, అది వస్తే ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒబిసిలు, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో బిజెపిని అధికారంలోకి రాకుండా నిరోధించాలని, దాని కుట్రలను వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులన్నీ ఐక్యమై తిప్పికొట్టాలని ప్రకాశ్ కారత్ పిలుపునిచ్చారు. వేలాది మంది ప్రజలు హాజరై ఈ సభను విజయవంతం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యాత్రకు నాయకత్వం వహించిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, పోతినేని సుదర్శన్, జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.





మీకోసం

పచ్చి మిరపకాయలు కోసిన తరువాత చేతులు మంటపుడుతుంటే.. పంచదార కలిపిన నీటితో చేతులు కడుక్కోవాలి.

జీవన సౌరభం

మేధావులు మౌనంగా ఉన్నంత కాలం మూర్ఖులు రాజ్యాలు ఏలుతారు.

ఎర్ర కాళ్ల కొంగలు!

పిల్లలూ! తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా, చింతపల్లి గ్రామానికి ప్రతి ఏడాది వచ్చే ఎర్రకాళ్ళ కొంగలు (పెయింటెడ్ స్టార్క్స్) గురించి ఈ రోజు తెలుసుకుందామా!

చూపులకు సైబీరియన్ కొంగలను పోలి ఉండే ఈ కొంగలకు ఆకారంలోనూ, రంగుల్లోనూ, అలవాట్లలోనూ తేడాలున్నాయి. ఇవి అచ్చంగా మన దేశపు కొంగలు. హిమాలయాల దక్షిణ భాగంలో కొంతకాలం వుండి అత్యంత శీతాకాలం ఏర్పడినప్పుడు అనుకూల వాతావరణం కోసం ఇలా వలస వస్తూ ఉంటాయి. ఇక్కడ గూడుకట్టుకుని సంతానోత్పత్తి చేసుకుని మళ్లీ వర్షాకాలం రాగానే కొన్నాళ్ళు ఆ ప్రాంతానికి వెళ్ళి వస్తాయి. 800 పైగా కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడకు వస్తాయి.

- ఇవి రెండు నుంచి మూడున్నర కేజీల వరకూ బరువు ఉండి, 93 నుంచి 102 సెంటీమీటర్ల ఎత్తు ఎదుగుతాయి. పొడవాటి పసుపు, గోధుమరంగు కలగలసిన గట్టిముక్కు, మెడ, దేహం కన్నా పొడవాటి సన్నటి పుల్లల్లాంటి గులాబీ రంగు కాళ్లు ఉంటాయి.
- నల్లటి అంచులతో విశాలంగా విచ్చుకునే రెక్కలు. కాని కొన్ని పక్షుల్లో మెరిసే ముదురు ఆకుపచ్చ వర్ణంలో వుంటాయి. ఆడ మగ పక్షుల్లో రంగుల్లో పెద్దతేడా వుండదు. కానీ పరిమాణంలో మాత్రం మగకొంగ ఆడకొంగకంటే పెద్దగా వుంటుంది.
- పొదిగే కాలంలో వీటి ముఖాలు, దేహాలు అందంగా ప్రకాశవంతంగా కనిపిస్తాయి.
- జనావాసాలతో కలగలిసి ఇళ్ల మధ్య చెట్లపై నివసించటం ఈ కొంగల అత్యంత ప్రత్యేకత. చెట్లపై ఇవి గూళ్లు కట్టుకుంటాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో గుడ్లు పెట్టి, పొదిగి పిల్లలుగా చేస్తాయి.
- ఎర్రతురాయి లాంటిది తలపై ఏర్పడటం, కొన్ని ఈకలను కోల్పోవటం, చర్మ కింద కొవ్వు నిల్వలను పేర్చుకోవడం అంటే పొదిగే దశకు చేరుకున్న పక్షి అని అర్థం.
- ఒక గూడులో జంట పక్షులుంటాయి. గుడ్లు పెట్టి పిల్లలను చేసిన తర్వాత వాటి సంరక్షణ మగపక్షి చూసుకుంటాయి. ఆడకొంగలు బయటకు వెళ్లి చెరువుల్లో వేటాడి చేపలు, నీళ్లు తీసుకొస్తాయి.
- గుడ్లను, పిల్లలను ఇతర జీవుల నుంచి చాలా శ్రద్ధగా కాపాడుకుంటాయి.
- పిల్ల పక్షులు లేత పసుపు రంగు, తెలుపులో ఉంటాయి. ఎదిగిన పక్షుల్లో ఎరుపు నారింజ ముఖం గులాబి రంగు కాళ్లు, గులాబీ రంగు రెక్కల్లోని ఈకలు వుంటాయి.
- ఎదిగే పిల్లలకు రోజుకు అరకిలో నుంచి 600 గ్రాముల వరకూ మేత తీసుకొచ్చి పెడతాయి.



- ఎండలు బాగా ముదిరిన సమయంలో పిల్లలకు ఇబ్బంది కాకుండా రెక్కలను గొడుగులా విప్పుకుని బోలెడంత సమయం వాటికి రక్షణ నిస్తూ నిలబడతాయి.
- పిల్ల కొంగలు ఎగిరేందుకు 60 నుంచి 70 రోజులు పడుతుంది. 85 రోజులవకూ స్వతంత్ర పక్షులుగా బతకలేవు. పిల్లలు తాము పుట్టిన గూటికే 115 రోజుల వరకూ కూడా తిరిగి చేరుకునే అలవాటును మానుకోవు. పిల్ల పక్షులు మూడేళ్ళ వరకూ ఇవి పరిపక్వం చెందవు. వీటి సాధారణ జీవిత కాలం 28 సంవత్సరాలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పంచ్ కొడితే పతకమే ...



మార్షల్ ఆర్ట్స్ అంటే మొదట గుర్తొచ్చేది జాకీచాన్, బ్రూస్లీ. వారి సినిమాలు చూసి స్ఫూర్తి పొందిన రాధా వారిలా పంచ్‌లు కొడుతోంది. సాధారణ కుటుంబంలో పుట్టి, పెరిగిన ఆమె తాను కన్న కలను నిజం చేసుకునేందుకు ప్రతిరోజూ కష్టపడుతోంది. అందుకు కుటుంబ ప్రోత్సాహం ఉన్నా... అవమానాలు, అవరోధాలు ఎదుర్కొన్నారు. అయినా నిత్యం శ్రమించింది. అదే ఆమెను అంతర్జాతీయ జడ్జీగా నిలబెట్టింది. వివాహం అయినా, ఓ బిడ్డ తల్లి అయినా కరాటే మాత్రం వదలలేదు. ఆమె యా..హు.. అంటూ కొట్టిన పంచ్‌కి ప్రత్యర్థి వెనకడుగు వేయాల్సిందే. పదేళ్ల కాలంలో దేశ విదేశాల్లో, జాతీయ స్థాయిలో తనదైన సత్తా చాటి 2 వేలకు పైగా పతకాలు సాధించింది. ఇప్పుడు ఎంతో మందికి ఈ యుద్ధవిద్యలో శిక్షణ ఇస్తోంది.

తండ్రే మార్గదర్శి

మహిళలు అంటే బలహీనులు, సున్నితత్వంగా ఉంటారని కొంతమంది అభిప్రాయపడతారు. కాని రాధాను, ఆమె దగ్గర శిక్షణ తీసుకున్న వారిని చూస్తే తాము పొరపడుతున్నామనుకుంటారు. తూర్పు గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన ఆళ్ల రాధ తండ్రి రాంబాబు బాడీ బిల్డర్. కుటుంబ పోషనకు రేషన్ డీలర్‌గా పనిచేశారు. తల్లి సూర్యకాంతం గృహిణి. వీరికి ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె అయిన రాధ ప్రభుత్వ పాఠశాల్లోనే చదువుకుంది. తండ్రిని చూస్తూ పెరిగిన ఆమె పలు క్రీడా స్ఫూర్తి సినిమాలు చూసేది. పదో తరగతి చదువుతున్న రోజుల్లో జాకీచాన్, బ్రూస్లీ ఫైట్ల సినిమాలు చూసి, ఆడపిల్లలకు కరాటే ఉపయోగపడుతుందని, తానూ నేర్చుకుంటానని అడిగింది. దాంతో సెలవుల్లో ఏలూరుకు చెందిన కోచ్ డీఎల్ నారాయణ దగ్గర మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకుంది. ఆయన జపాన్ షోటోకాన్ కన్నీన్ జు కరాటే ఏపీ ఇన్‌స్ట్రక్టర్, 6వ డాన్ బ్లాక్ బెల్ట్. రాధకు మొదట తర్ఫీదు కష్టంగా ఉండటంతో తల్లిదండ్రులు వద్దు అని వారించారు. ఆడపిల్లలకు ఈ ఫైట్లు ఎందుకు అంటూ వెనక్కులాగే ప్రయత్నం చేశారు. కాని రాధ మాత్రం అప్పటికే 'మార్షల్ ఆర్ట్స్‌లో మహిళ ఏషియన్ రిఫరీ' అవ్వాలని లక్ష్యం పెట్టుకుంది. అది సాధించే వరకూ యుద్ధవిద్యను వదలనంటూ పట్టుబట్టింది. తల్లిదండ్రులు ప్రోత్సహించారు. 15 ఏళ్ల వయస్సులో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఆ ఏడాదిలోనే రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటి అవార్డులు సొంతం చేసుకుంది. అప్పటి వరకూ చిన్నచూపు చూసిన బంధువులు, హేళన చేసిన స్నేహితులు ఆమెను అభినందించారు.

అంతర్జాతీయ న్యాయ నిర్ణేతగా ...

రాధ ఇంటర్‌లో ఉండగానే షోటోకాన్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఫోర్తడాన్ బ్లాక్ బెల్ట్ (4 బెల్టులు) సాధించింది. 2008 జైపూర్ అంతర్జాతీయ కరాటేలో ప్రథమం, 2009లో జాతీయస్థాయి కరాటేలో ప్రథమం, 2010లో లక్నోలో జాతీయస్థాయి కరాటేలో ప్రథమం, 2011 భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రథమం, 2012 విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయిలో ప్రథమం, 2013 ముంబైలో జాతీయస్థాయిలో ప్రథమ స్థానం, 2014లో కొల్‌కతా జాతీయస్థాయిలో ప్రథమ స్థానం, 2015లో న్యూఢిల్లీ ఆల్‌కటోరా ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ న్యాయ నిర్ణేత పరీక్షల్లో 'కటా కుమితే' విభాగంలో 'అంతర్జాతీయ న్యాయ నిర్ణేతగా ఉత్తీర్ణత' సాధించింది. అదే ఏడాది ముంబై, దుబాయ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని స్వర్ణం, రజత పతకాలు సాధించింది. 2016లో మలేషియాలో వెండి పతకం సాధించింది.

22 ఏళ్లకే 'మొదటి మహిళా నేషనల్ జడ్జి'గా పేరు గడించింది. 2017 విశాఖ, ముంబైలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి 'బెస్ట్ కరాటే ఖా' అవార్డు దక్కించుకుంది. ముంబై ఖాయ్-ఏ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గ్రాండ్ మాస్టర్ ఎమాయురా చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్ ఫోర్త్ డాన్‌ను కైవసం చేసుకుంది. 2018 ఖండాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు, బెస్ట్ కరాటే అవార్డును అందుకున్నారు. దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో 50 కేజీల, 25 సంవత్సరాల కటా కుమితే విభాగాల్లో రెండు బంగారు పతకాలను సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. 2022 డిసెంబర్‌లో గుజరాత్‌లో 'కియో' ఎ గ్రేడ్ ఎగ్జామనేషన్‌లో పాసయ్యి, జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించింది. ఇప్పటి వరకూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో 2 వేలకు పైగా బంగారు, వెండి, రజిత పతకాలు, అంతర్జాతీయ ఏషియన్ స్థాయిలో 47 పతకాలు సాధించి ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.





పోలీసు అభ్యర్థులకు శిక్షణ

రాధకు ఇంటర్ తర్వాత పెళ్లి చేశారు తల్లిదండ్రులు. కొవ్వూరులో చిన్న ఇంటిలోనే నివాసం ఉంటూ 2012లో డాబా పైన పిల్లలకు కరాటేలో శిక్షణ ఇచ్చింది. అత్తవారింట్లో కూడా ఎన్నో ఆటంకాలు వచ్చాయి. అయినా పట్టు వదలకుండా ఆత్మవిశ్వాసంతో పలు టోర్నమెంట్లలో పాల్గొంది. ఏడాది తర్వాత ఓ పాప పుట్టింది. కూతురిని చూసుకుంటూ, ఇంటి బాధ్యతలు పంచుకుంది. ఈ క్రమంలో ఆమె కొవ్వూరు చుట్టు పక్కల ఉన్న 15 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, కాలేజీల్లో సెల్ఫ్ డిఫెన్స్, వెపన్ ట్రైనింగ్ నాన్చాక్, సోర్డ్, స్టిక్ ఇలా పలు రకాల వెపన్స్ ఉపయోగించి కరాటే నేర్పిస్తూ జీవనోపాధిని పొందుతుంది. 2018-19లో పోలీసు ఉద్యోగానికి ఎంపికైన 100 మంది మహిళా అభ్యర్థులకు తొమ్మిది నెలల పాటు కరాటేలో మెలకువలు నేర్పించింది. గత ఏడాది తిరుపతి సమీపంలోని కళ్యాణ్‌డామ్‌లో పోలీసు ట్రైనింగ్ సెంటర్లో మహిళా పోలీసు కానిస్టేబుళ్లు, ఎస్సైలు, పురుష ఎస్సైలకు నెల రోజులు శిక్షణ ఇచ్చింది. రోజు వారీగా తన శిక్షణ కేంద్రంలో 120 మందికి పైగా చిన్నారులకు యోగా, మహిళలకు వెయిట్ లాస్, బాడీ ఫిట్నెస్ విభాగాల్లో కసరత్తులు చేయిస్తోంది. కుటుంబాన్ని చూసుకుంటూ ప్రయివేటుగా డిగ్రీ చదివిన రాధ ఈ పదేళ్లలో సుమారు ఐదు వేల మందికి పైగా యువతకు, విద్యార్థులకు కరాటే పట్ల ఆసక్తి పెంచింది. ఎంతోమందిని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దింది. వీరిలో డాక్టర్లు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించిన వారూ ఉన్నారు.

- పద్మావతి



ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

నాకు చిన్నప్పటి నుంచీ అనుకున్నది సాధించాలనే పట్టుదల ఎక్కువ. అందుకు చాలా కష్టపడతా. నా చుట్టూ ఉన్నవాళ్లనూ అలాగే ప్రోత్సహిస్తా. అందుకే కుటుంబంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా మార్షల్ ఆర్ట్స్ వదలిపెట్టలేదు. 'మార్షల్ ఆర్ట్స్‌లో మహిళ ఏషియన్ రిఫరీ అవ్వాలన్నదే నా కల. నా సొంత ఖర్చులతో అన్ని టోర్నమెంట్లలో పాల్గొని మెడల్స్ సాధించా. దూర ప్రయాణాలు, ఎంట్రీకి చాలా ఖర్చు అవుతోంది. అందుకే ప్రభుత్వ ప్రోత్సాహం ఉండాలి. మాలాంటి మహిళా క్రీడాకారులను అధికారులు గుర్తించి వెన్నుతట్టాలి. అప్పుడే మాలో ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుంది.

- రాధ, కరాటే బ్లాక్ బెల్ట్ ఫోర్తుడాన్.

సాక్షి సర్క్యులేషన్‌పై సిఎంకు సుప్రీం నోటీసులు

10కి కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సాక్షి అమ్మకాలు విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన భార్య భారతి, రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ప్రతినిధులకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులిచ్చింది. వైఎస్ జగన్ యాజమాన్యంలో, నియంత్రణలో ఉన్న సాక్షి దినపత్రికను అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అమ్మకాలను మెరుగుపరచడానికి ఉద్దేశించిన ప్రభుత్వ ఉత్తర్వు (జిఒ)ను వ్యతిరేకిస్తూ ఈనాడు యాజమాన్యంలోని ఉషోదయ పబ్లికేషన్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ జిఒను రద్దు చేసేందుకు నిరాకరిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ఉషోదయ పబ్లికేషన్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను బుధవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దీవాలాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఉషోదయ పబ్లికేషన్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. సాక్షి చందా నెలకు రూ.176.50 అని, ఈనాడు చందా నెలకు రూ.207.50 అని తెలిపారు. గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాల యాలు సాక్షి పేపరు వేయించుకునేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకం గానే అదనపు గ్రాంట్ కింద నెలకు రూ.200 మంజూరు చేస్తూ జిఒ ఇచ్చిందని తెలిపారు. ఈ రకంగా సాక్షి సర్క్యులేషన్ పెంచుకోవడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. సాక్షికి సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యజమాని అని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబుతో ఉన్న వ్యతిరేక తను ఈనాడు పై దాడి చేయాలను కుంటున్నారని అన్నారు. ఈనాడు ఎల్లో జర్నలిజమని, దాని జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం కూడా చెప్పిందని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం ప్రచారమని, ముఖ్యమంత్రి వ్యాఖ్యలు కూడా చేశారని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం నోటీసులు జారీ చేసి, ఏప్రిల్ 10కి విచారణ వాయిదా వేసింది.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య

సెల్ఫీ వీడియో తీసుకుని కాలువలో దూకి మృతి

ప్రజాశక్తి - అనకాపల్లి

అప్పుల బాధతో దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. తాము చనిపోతున్నామంటూ విశాఖ జిల్లా వడ్లపూడి పరిధి తిరుమల నగర్‌కి చెందిన ఉక్కు ఉద్యోగి వరప్రసాద్, మీరా దంపతులు సెల్ఫీ వీడియో తీసుకుని మంగళవారం నుంచి అకస్మాత్తుగా కనిపించకుండా పోయారు. వరప్రసాద్ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తుమ్మపాల ఏలేరు కాలువ వద్ద మృతుల ద్విచక్ర వాహనం, సెల్‌ఫోను, హ్యాండ్ బ్యాగ్, చెప్పులు ఉన్న నేపథ్యంలో మంగళవారంతా ఆ పరిసర ప్రాంతాల్లోనే గాలించారు. గజ ఈతగాళ్లను సైతం రంగంలోకి దింపారు. చివరకు రాజుపాలెం రైల్వేగేటు సమీపంలోని ఏలూరు కాలువలో బుధవారం మృతదేహాలు లభ్యమయ్యాయి.



వరప్రసాద్, మీరా దంపతుల(ఫైల్)

దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతోనే..

వరప్రసాద్‌కు రూ.60 లక్షలు వరకూ అప్పులు ఉన్నట్టు బంధువులు చెబుతున్నారు. కుమార్తె వివాహానికి, కొడుకుతో వ్యాపారం పెట్టించేందుకు అప్పు చేశారు. వడ్డీలకే జీతం సరిపోతుండటం, కుటుంబం నడవటం కష్టంగా మారడం, అవమాన భారంతో దంపతులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడినట్లు సమీప బంధువులు చెబుతున్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

ప్రజాశక్తి-చేబ్రోలు (గుంటూరు జిల్లా)

తమ ప్రేమను పెద్దలు కాదనడంతో యువ జంట రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సుద్దపల్లి రైల్వేగేటు వద్ద బుధవారం వెలుగుచూసింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శలపాడు గ్రామానికి చెందిన ఉయ్యూరు శ్రీకాంత్ అదే గ్రామానికి చెందిన పులి త్రివేణి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ తెనాలిలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. వారి ప్రేమ వ్యవహారం తల్లిదండ్రులకు తెలియడంతో ఇద్దరినీ మందలించారు. వీరి వివాహానికి ఇరు కుటుంబ సభ్యులు అడ్డుచెప్పడంతో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో మంగళవారం యువతి తల్లిదండ్రులు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సుద్దపల్లి రైల్వేగేటు వద్ద ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. తెనాలి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దళితులపై దాడులు టిడిపి హయాంలోనే ఎక్కువ: మంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని రాష్ట్ర ప్రభుత్వంపై టిడిపి వ్యూహాత్మకంగా దుష్ప్రచారం చేస్తోందని పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. దళితులపై దాడులు ఎక్కువగా టిడిపి హయాంలోనే జరిగాయని, తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డుల ప్రకారం టిడిపి హయాంలో 2014లో 2,113, 2015లో 2,263, 2016లో 2,335, 2017లో 1,969 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

గూగుల్‌కు ఎన్‌సిఎల్‌ఎటి భారీ షాక్


రూ.1,137 కోట్ల జరిమానా చెల్లించాల్సిందే

సిసిఐ కేసులో ఆదేశాలు

న్యూఢిల్లీ : దిగ్గజ సెర్చింజన్ గూగుల్‌కు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌ఎటి) భారీ షాక్ ఇచ్చింది. ఆండ్రాయిడ్ మొబైల్ డివైజ్ ఎకో సిస్టమ్‌లో తన ఆధిపత్య స్థానాన్ని దుర్వినియోగం చేసినందుకు గాను గూగుల్‌కు గతంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) రూ.1,337 కోట్ల భారీ జరిమానా విధించింది. భారత్‌లో అనైతిక వ్యాపార పద్ధతులను మానుకోవాలని, తన ప్రవర్తనను మార్చుకోవాలని సూచించింది. దీన్ని ఎన్‌సిఎల్‌ఎటిలో గూగుల్ సవాల్ చేసింది. ఈ అంశంలో బుధవారం ఎన్‌సిఎల్‌ఎటి చైర్‌పర్సన్, జస్టిస్ అశోక్ భూషణ్, సభ్యుడు అలోక్ శ్రీవాస్తవతో కూడిన బెంచ్ తీర్పును వెలువరించింది. 30 రోజుల్లోపు సిసిఐ విధించిన జరిమానా రూ.1337.76 కోట్లను డిపాజిట్ చేయాల్సిందేనని బెంచ్ స్పష్టం చేసింది. సిసిఐ ఇచ్చిన ఉత్తర్వులు ఎలాంటి పక్షపాతంతో కూడుకుని లేవని ట్రిబ్యునల్ పేర్కొంది. అలాగే 11 అప్లికేషన్లతో కూడిన గూగుల్ సూట్‌ను ముందే ఇన్‌స్టాల్ చేయాలని ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులను (ఒఇఎం) గూగుల్ కోరడం అన్యాయమేనని స్పష్టం చేసింది. ఆండ్రాయిడ్ ఫోర్క్‌లను అభివృద్ధి చేయడం, పంపిణీ చేయడం నుంచి ఒఇఎం నిషేధించే యాంటీ ఫ్రాగ్మెంటేషన్ అగ్రిమెంట్ షరతులను తప్పుపట్టింది. కాగా.. సిసిఐ జారీ చేసిన నాలుగు కీలక ఆదేశాలను పక్కన పెట్టడం గూగుల్‌కు కొంత ఊరట. సిసిఐ ఆర్డర్‌లోని 617.3, 617.9, 617.10 617.7 పేరాల్లో జారీ చేసిన ఆదేశాలను కోర్టు పక్కన పెట్టింది. జరిమానాను 30 రోజుల్లో చెల్లించాలని గడువు పెట్టింది. ట్రిబ్యునల్ తీర్పునపై గూగుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది.

సమతూకంలో సన్‌రైజర్స్

మార్క్రమ్‌కు పగ్గాలు.. అందుబాటులో నటరాజన్.. ఓపెనర్‌గా మయాంక్



హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్సీ బాధ్యతలను మరోసారి విదేశీ ఆటగాడు అందుకున్నాడు. దక్షిణాఫ్రికా ఆటగాడు ఆడెన్ మార్కరమ్‌ను జట్టు కెప్టెన్‌గా సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ బుధవారం ప్రకటించింది. 2016లో డేవిడ్ వార్నర్ సారథ్యంలో తొలిసారి టైటిల్‌ను సాధించిన హైదరాబాద్ జట్టు ఆ తర్వాతి సీజన్‌లలో ఆశించిన మేరకు రాణించలేకపోయింది. ఆ తర్వాతి సీజన్‌లలో కనీసం ప్లే-ఆఫ్‌కు చేరడంలోనూ విఫలమైంది. ఇక 2022 సీజన్‌కు కేన్ విలియమ్సన్ కెప్టెన్‌గా వ్యవహరించగా.. ఆ సీజన్‌లో సన్‌రైజర్స్ జట్టు 6మ్యాచుల్లో గెలిచి 8మ్యాచుల్లో ఓటమిపాలైంది. మినీ వేలంలో హారీ బ్రూక్స్‌ను రూ.15కోట్ల అత్యధిక ధరకు మినీవేలంలో సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేసింది. బ్రూక్స్, మయాంక్ కెప్టెన్ రేసులో ఉన్నా.. మేనేజ్‌మెంట్ మాత్రం మార్క్రమ్‌వైపే మొగ్గింది. ఇక ఓపెనింగ్ బాధ్యతలు మయాంక్ అగర్వాల్‌పై ఉండగా.. బౌలింగ్ భారం సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌పై పడింది. అలాగే యువ క్రికెటర్లు ఉమ్రన్ మాలిక్‌తోపాటు గాయంతో గత సీజన్‌కు దూరమైన టి. నటరాజన్ ఈసారి ఐపిఎల్‌లో ఆడనున్నాడు.

జట్టు: మార్క్రమ్, రాహుల్‌త్రిపాఠి, గ్లెన్ ఫిలిప్స్, ఉమ్రన్ మాలిక్, ఫజల్ ఫరూఖీ, కార్తీక్ త్యాగీ, టి. నటరాజన్, భువనేశ్వర్, అబ్దుల్ సమద్, మార్కో జాన్సన్, అభిషేక్ శర్మ, వాషింగ్టన్ సుందర్, హారీ బ్రూక్స్, మయాంక్ అగర్వాల్, హెన్రిక్ క్లాసెన్, మయాంక్ మార్కండే, ఆదిల్ రషీద్, వివాంత్ శర్మ, ఉపేంద్ర యాదవ్, సన్వీర్ సింగ్, సమర్థ్ వ్యాస్, మయాంక్ దగర్, నితీశ్ కుమార్ రెడ్డి, అకెల్ హొసైన్, అన్మోల్‌ప్రీత్ సింగ్.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ముంబయి కెప్టెన్, కోచ్

ఐపిఎల్ రేపటినుంచే..



రోహిత్‌పై భారం తగ్గిస్తాం

ముంబయి హెడ్ కోచ్ మార్క్ బౌచర్

ముంబయి: రేపటినుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-16 ప్రారంభం కానుంది. ఈ క్రమంలో అత్యధికసార్లు టైటిల్ విజేత ముంబయి ఇండియన్స్ హెడ్ కోచ్ మార్క్ బౌచర్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కెప్టెన్ రోహిత్ శర్మపై భారం తగ్గిస్తామని, అవసరమైతే ఒకటి, రెండు మ్యాచ్‌లకు అతడికి విశ్రాంతినిస్తామని వెల్లడించాడు. స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఈ సీజన్ ఐపిఎల్‌కు దూరం కావడం లోటే అయినప్పటికీ.. మిగిలిన బౌలర్లంతా ఇటీవలికాలంలో అద్భుత ఫామ్‌లో ఉండడం తమకు కలిసి రానుందన్నాడు. ఐపిఎల్ ముగిసిన అనంతరం టీమిండియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌లో ఆడాల్సి ఉందని, ఈ క్రమంలో కెప్టెన్‌పై వర్క్‌లోడ్ తగ్గించమని మేనేజ్‌మెంట్ కోరిందని బౌచర్ వెల్లడించాడు.

మహ్మద్ ఫైజల్‌పై అనర్హత వేటు ఉపసంహరణ

నోటిఫికేషన్ విడుదల చేసిన లోక్‌సభ సెక్రటేరియట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లక్షద్వీప్‌కు చెందిన ఎన్‌సిపి ఎంపి మహ్మద్ ఫైజల్‌పై అనర్హత వేటును లోక్‌సభ ఉపసంహరించుకుంది. ఈ మేరకు బుధవారం లోక్‌సభ సెక్రటేరియట్ ఉత్తర్వులు జారీ చేసింది. తన అనర్హతకు వ్యతిరేకంగా ఫైజల్ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగా లోక్‌సభ సెక్రటేరియట్ అత్యవసర సర్క్యులర్ జారీ చేయడం గమనార్హం. 2009 దాడి కేసులో మహ్మద్ ఫైజల్ దోషిగా నిర్ధారిస్తూ కావరత్తి సెషన్స్ కోర్టు ఈ ఏడాది జనవరి 11న తీర్పు ఇచ్చింది. పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీంతో జనవరి 13న లోక్‌సభ సెక్రటేరియట్ ఫైజల్ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఫైజల్ కేరళ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారణ జరిపిన కేరళ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలను సుప్రీం కోర్టులో లక్షద్వీప్ అడ్మినిస్ట్రేషన్ సవాల్ చేసింది. హైకోర్టు తీర్పుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. అయినప్పటికీ ఫైజల్‌ను పార్లమెంట్‌కు అనుమతించలేదు.

ఆకర్షి కశ్యప్ సంచలనం

15వ ర్యాంకర్‌పై గెలుపు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ సంచలనం నమోదు చేసింది. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో ఆకర్షి 12-21, 21-15, 21-18తో 15వ ర్యాంకర్, కెనడాకు చెందిన మిచ్చెలీకి ఝలక్ ఇచ్చింది. తొలి గేమ్‌ను ఓడిన ఆకర్షి.. రెండు, మూడు గేమ్‌లలో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఈ గేమ్ సుమారు 51నిమిషాలసేపు సాగింది. టాప్-15లోపు ర్యాంకర్‌పై ఆకర్షి కశ్యప్ గెలుపొందడం ఇదే ప్రథమం. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-11, 25-27, 23-21తో థమ్మసిన్ సిత్తికోమ్(థాయ్‌లాండ్)పై, బి. సాయిప్రణీత్ 21-16, 18-21, 21-12తో జాన్ లౌడా(చెక్ రిపబ్లిక్)పై చెమటోడ్చి నెగ్గారు. ఇక మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ-గాయత్రీ గోపీచంద్, పురుషుల డబుల్స్ సాత్విక్-చిరాగ్ జోడీ తొలిరౌండ్‌లోనే ఓడారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68